STv SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

సమయం

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 19 | సంచిక: 345 | ఎడిటర్ : అలీ ముర్తుజా | శనివారం 14 నవంబర్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల:రూ.5 |

ఒక నగ్న ఫొటోకు.. ఓ యుద్ధ ప్లాన్ లీక్



- పాక్ గూఢచారితో ఐఏఎఫ్ అధికారి బేరం!
- పాక్ యువతి వలపు వలలో చిక్కుకుని దేశ రహస్యాలను తాకట్టు పెట్టిన వింగ్ కమాండర్
- సబ్‌ఆర్డినేట్‌ల ఫోన్లలోనూ మాల్‌వేర్ యాప్ ఇన్‌స్టాల్ చేయించిన నిందితుడు

4

మహిళా కోటాపై కేంద్రం పట్టు

- మరోసారి డీలిమిటేషన్ బిల్లు!
- రాజ్యాంగ సవరణ బిల్లుల ఆమోదానికి కేంద్రం కసరత్తు
- ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల నిర్వహణపై చర్చ
- మూడింట రెండొంతుల మెజారిటీ సాధిస్తామన్న ధీమా
- అవసరమైన మెజారిటీ కంటే 15-18 ఓట్లు అదనంగా వస్తాయని అంచనా
- లోక్‌సభ స్థానాలను 543 నుంచి 850కి పెంచే ప్రతిపాదన

4



మోదీ నా ఫోన్ ట్యాప్ చేస్తున్నారు: రాహుల్ గాంధీ

- ప్రధాని ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడుతున్నారని ఆరోపణ
- ఆరోపణలకు ఆధారాలు ఫోన్‌లోనే ఉన్నాయని వ్యాఖ్య
- మోదీతో ముఖాముఖి చర్చకు మరోసారి సవాల్
- ఇన్‌స్టాగ్రామ్ ప్రశ్నోత్తరాల్లో రాహుల్ వ్యాఖ్యలు

2



యూనిఫామ్‌లో క్రిమినల్!



- సజ్జనార్‌పై సీబీఐ మాజీ డైరెక్టర్ సంచలన వ్యాఖ్యలు
- ఒక సహోద్యోగిపై ఇలా చెప్పడం బాధాకరమే
- కానీ ఇదే నూటికి నూరు శాతం వాస్తవం
- బదిలీ చేస్తే సరిపోదు.. సమగ్ర విచారణ జరపాలి
- సీఎం, డీజీపీ నిర్ణయానికి నాగేశ్వరరావు ధన్యవాదాలు

2

మహిళా ఎస్సై అక్రమ వసూళ్లపై

సజ్జనార్ ఆగ్రహం

ప్రొబేషనరీ కాలం పూర్తికాకముందే సస్పెన్షన్ వేటు

ఏసీబీ వలకు చిక్కుతున్న పలువురు పోలీసు అధికారులు

2



ప్రపంచ మేధోమథనానికి భాగ్యనగరం వేదిక!

భారత్ సమ్మిట్-2026 తొలిరోజు కీలక చర్చలు

ప్రపంచ రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిణామాలపై సమగ్రంగా చర్చించేందుకు హైదరాబాద్ వేదికగా నిర్వహిస్తున్న 'భారత్ సమ్మిట్-2026' తొలిరోజు కార్యక్రమాలు శుక్రవారం విజయవంతంగా కొనసాగాయి. హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా 'తెలంగాణ రైజింగ్' ఇతివృత్తంతో నాలుగు కీలక అంశాలపై ప్రత్యేక ప్యానల్ చర్చలు జరిగాయి. పట్టణీకరణ, ఫ్యూచర్ సిటీ, ఆర్థిక న్యాయం, సామాజిక న్యాయం, సంక్షేమ విధానాలపై దేశవిదేశాల నుంచి వచ్చిన ప్రముఖులు, నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలు, సామాజిక సమానత్వం, సంక్షేమ పథకాల అమలు ప్రధాన చర్చనీయాంశాలుగా నిలిచాయి.

'తెలంగాణ రైజింగ్' ఇతివృత్తంతో నాలుగు ప్రత్యేక సమావేశాలు

- 'తెలంగాణ రైజింగ్' ఇతివృత్తంతో నాలుగు ప్రత్యేక సమావేశాలు
- ఫ్యూచర్ సిటీ, పట్టణాభివృద్ధిపై మంత్రి శ్రీధర్‌బాబు వివరణ
- ఆర్థిక, సామాజిక న్యాయం.. సంక్షేమ విధానాలపై చర్చలు
- తెలంగాణ అభివృద్ధి ప్రణాళికలపై అంతర్జాతీయ ప్రతినిధుల దృష్టి
- రెండో రోజు సహకార సమాఖ్యవాదం, ఎన్నికల సమగ్రతపై చర్చలు
- నేడు హాజరుకానున్న రాహుల్‌గాంధీ

హైదరాబాద్, నవంబర్ 13 (సమయం న్యూస్): ప్రపంచ రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిణామాలపై సమగ్రంగా చర్చించేందుకు హైదరాబాద్ వేదికగా నిర్వహిస్తున్న 'భారత్ సమ్మిట్-2026' తొలిరోజు కార్యక్రమాలు శుక్రవారం విజయవంతంగా కొనసాగాయి. హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా 'తెలంగాణ రైజింగ్' ఇతివృత్తంతో నాలుగు కీలక అంశాలపై ప్రత్యేక ప్యానల్ చర్చలు జరిగాయి. పట్టణీకరణ, ఫ్యూచర్ సిటీ, ఆర్థిక న్యాయం, సామాజిక న్యాయం, సంక్షేమ విధానాలపై దేశవిదేశాల నుంచి వచ్చిన ప్రముఖులు, నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

వివరాలు 2 లో



చేవెళ్లలో ఆర్మీ వాహనం బోల్తా

14 మంది జవాన్లకు గాయాలు

ఎనిమిది మంది పరిస్థితి విషమం

కారును తప్పించబోయి చెట్టును ఢీకొన్న వాహనం

3

టీజీ టెట్

నోటిఫికేషన్ విడుదల

జనవరి 3 నుంచి 15 వరకు పరీక్షలు

నవంబర్ 16 నుంచి దరఖాస్తుల స్వీకరణ

పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్



2

పెట్టుబడులకు తెలంగాణే గమ్యం



ప్రపంచానికి చాటేందుకే భారత్ సమ్మిట్!

- రాష్ట్రాన్ని అంతర్జాతీయ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- 70 దేశాల నుంచి వెయ్యి మంది ప్రతినిధులకు ఆహ్వానం
- డిసెంబర్ 7 నుంచి ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్
- తెలంగాణకు విదేశీ ప్రతినిధులే బ్రాండ్ అంబాసిడర్లు కావాలి
- గిగ్ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక విధానం
- రాహుల్‌గాంధీని ఆహ్వానించాం.. సదస్సుపై దుష్ప్రచారం తగదు
- 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం

2

ఎల్‌నినో ప్రభావంపై ప్రభుత్వ ప్రత్యేక దృష్టి

- భూగర్భ జలాల పరిస్థితిపై ఉత్తమ్ సమీక్ష ■15న మోదీతో భేటీ
- కేంద్రం నుంచి ప్రత్యేక ఆర్థిక సాయం కోరనున్న సీఎం, మంత్రి
- జల సంరక్షణకు తక్షణ, దీర్ఘకాలిక ప్రణాళికలు

3



అండాల సేకరణ దందా గుట్టురట్టు

- ఫెర్టిలిటీ కేంద్రాలపై క్రిమినల్ కేసులు నమోదు
- బేగంపేట హాస్టల్‌లో 12 మంది మహిళలకు విముక్తి
- రూ.50 వేల ఆశచూపి ఇతర రాష్ట్రాల నుంచి తరలింపు
- ప్రమాదకర హార్మోన్ ఇంజెక్షన్లతో మహిళల ఆరోగ్యానికి ముప్పు



2



యూనిఫామ్‌లో క్రిమినల్!

సజ్జనార్‌పై సీబీఐ మాజీ డైరెక్టర్ సంచలన వ్యాఖ్యలు

ఒక సహోద్యోగిపై ఇలా చెప్పడం బాధాకరమే

కానీ ఇదే నూటికి నూరు శాతం వాస్తవం

బదిలీ చేస్తే సరిపోదు.. సమగ్ర విచారణ జరపాలి

సీఎం, డీజీపీ నిర్ణయానికి నాగేశ్వరరావు ధన్యవాదాలు

హైదరాబాద్, నవంబర్ 14 (సమయం న్యూస్): తెలంగాణలో సీనియర్ ఐపీఎస్ అధికారి వీసీ సజ్జనార్ బదిలీ వ్యవహారం ఇప్పుడు సంచలనంగా మారింది. ఆయన బదిలీపై స్పందిస్తూ సీబీఐ మాజీ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో పోలీసు కమిషనర్‌గా పనిచేసిన సజ్జనార్‌ను బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డీజీపీ సీవీ ఆనంద్‌లకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అయితే ఈ సందర్భంగా సజ్జనార్‌పై ఆయన వాడిన పదజాలం, చేసిన ఆరోపణలు పోలీసు వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఎక్స్ వేదికగా స్పందించిన నాగేశ్వరరావు.. సజ్జనార్‌ను ఉద్దేశించి 'యూనిఫామ్‌లో ఉన్న క్రిమినల్' అంటూ అత్యంత తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఒక మాజీ సహోద్యోగిపై ఇలాంటి బహిరంగ ఆరోపణలు చేయడం తనకు వ్యక్తిగతంగా ఎంతో బాధ కలిగిస్తోందని, కానీ వాస్తవాలను దాచలేనని ఆయన కుండబద్దలు కొట్టారు. సజ్జనార్ తీరుపై ఆయన చేసిన ఈ సంచలన వ్యాఖ్యలు ఇప్పుడు అటు రాజకీయ, ఇటు అధికార వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి.

కేవలం బదిలీ ఏమాత్రం శిక్ష కాదు..

ఒక అధికారిని కేవలం ఒక పోస్టు నుంచి మరో పోస్టుకు బదిలీ చేయడం ఏమాత్రం శిక్ష కిందకు రాదని నాగేశ్వరరావు స్పష్టం చేశారు. బదిలీల వల్ల వ్యక్తుల్లోని నేర స్వభావం, వారి ప్రవర్తన ఏమాత్రం మారిపోవని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. యూనిఫామ్ ముసుగులో నేరాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. సజ్జనార్‌పై గతంలో వచ్చిన ఆరోపణలు, ఆయన తీసుకున్న వివాదాస్పద నిర్ణయాలు, చేసినట్లుగా చెబుతున్న చట్టవ్యతిరేక చర్యలపై ప్రభుత్వం తక్షణమే ఒక సమగ్ర విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. నిష్పక్షపాతంగా జరిగే ఈ విచారణలో ఆయన తప్పు చేసినట్లు నిర్ధారణ అయితే, చట్టప్రకారం అత్యంత కఠినమైన శిక్ష విధించాలని స్పష్టం చేశారు. పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం నిలబడాలంటే ఇలాంటి వ్యవహారాలపై లోతైన దర్యాప్తు జరిపి తీరాల్సిందేనని నాగేశ్వరరావు తన పోస్టులో కుండబద్దలు కొట్టారు.

మహిళా ఎస్సై అక్రమ వసూళ్లపై సజ్జనార్ ఆగ్రహం

ప్రొబేషనరీ కాలం పూర్తికాకముందే సస్పెన్షన్ వేటు

ఏసీబీ వలకు చిక్కుతున్న పలువురు పోలీసు అధికారులు

హైదరాబాద్, నవంబర్ 13 (సమయం న్యూస్): ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు సిబ్బందిలో కొందరు అక్రమ వసూళ్లు, లంచాలు, సెటిల్‌మెంట్లకు పాల్పడుతుండటం పోలీసు శాఖలో కలకలం రేపుతోంది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో వరుసగా అవినీతి ఆరోపణలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా కుల్సుంపుర సబ్‌డివిజన్ పరిధిలో పనిచేస్తున్న 2024 బ్యాచ్ మహిళా ఎస్సై వ్యవహారంపై పోలీసు కమిషనర్ సజ్జనార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిర్యాదుదారుల నుంచి డబ్బులు వసూలు చేయడంతోపాటు సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకుని సెటిల్‌మెంట్లు చేస్తున్నట్లు మహిళా ఎస్సైపై ఫిర్యాదులు అందాయి. దీంతో ఆమెను సస్పెండ్ చేసి హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. ఆమెకు సహకరించిన ఇద్దరు కానిస్టేబుళ్లపైనా క్రమశిక్షణ చర్యలకు అధికారులు సిద్ధమయ్యారు. మరోవైపు జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో 15 రోజుల వ్యవధిలో ఇన్‌స్పెక్టర్, ఎస్సై వేర్వేరు లంచం కేసుల్లో ఏసీబీకి పట్టుబడ్డారు. మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్ కొండల్ రావు, ఓ కానిస్టేబుల్ సివిల్ వివాదంలో రూ.3 లక్షలు తీసుకుంటూ పట్టుబడగా, బంజారాహిల్స్ ఎస్సై విజయ్ రూ.10 లక్షలు లంచం డిమాండ్ చేసిన కేసులో అరెస్టయ్యారు. ఫిల్మ్‌నగర్‌లో బైకిస్ట్‌పై దాడి చేసి నగదు, బంగారం దోచుకున్న ఘటనలో పోలీసు సిబ్బంది అరెస్టయ్యారు. సైఫాబాద్‌లోనూ ఇలాంటి ఘటన చోటుచేసుకోగా, సనత్‌నగర్‌లో వాహనదారుడి నుంచి లంచం తీసుకుంటూ ఇద్దరు కానిస్టేబుళ్లు పట్టుబడ్డారు. అవినీతి, అక్రమాలకు పాల్పడే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నారు.

టీజీ టెట్ నోటిఫికేషన్

జనవరి 3 నుంచి 15 వరకు పరీక్షలు

నవంబర్ 16 నుంచి దరఖాస్తుల స్వీకరణ

పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్

హైదరాబాద్, నవంబర్ 13 (సమయం న్యూస్): హైదరాబాద్, నవంబర్ 13: తెలంగాణలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీజీ టెట్) నిర్వహణకు పాఠశాల విద్యాశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ శుక్రవారం ఈ ప్రకటన చేశారు. వచ్చే ఏడాది జనవరి 3 నుంచి 15 వరకు ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు ఈ నెల 16 నుంచి డిసెంబర్ 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి నోటిఫికేషన్, ఇన్ఫర్మేషన్ బులెటిన్ ఈ నెల 16 నుంచి విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి. పరీక్షకు సంబంధించిన అర్హతలు, పేపర్-1, పేపర్-2 సిలబస్, దరఖాస్తు రుసుము, పరీక్షా కేంద్రాల వివరాలను https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చని అధికారులు సూచించారు. అభ్యర్థులు నోటిఫికేషన్‌లోని నిబంధనలు పరిశీలించి గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని నవీన్ నికోలస్ తెలిపారు.

ప్రపంచ మేధోమథనానికి భాగ్యనగరం వేదిక!

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా తెలంగాణ భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలు, సామాజిక సమానత్వం, సంక్షేమ పథకాల అమలు ప్రధాన చర్చనీయాంశాలుగా నిలిచాయి. 'ఫోర్జింగ్ ఏ న్యూ వరల్డ్' నినాదంతో అంతర్జాతీయ వేదిక: 'ఫోర్జింగ్ ఏ న్యూ వరల్డ్' అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్-2026 రెండో ఎడిషన్‌లో ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న రాజకీయ, ఆర్థిక పరిణామాలు, ప్రజాస్వామ్య పరిరక్షణ, అంతర్జాతీయ సహకారం, కృత్రిమ మేధ (ఏఐ), వాతావరణ మార్పులు వంటి కీలక అంశాలు ప్రధాన ఎజెండాగా నిలిచాయి. వివిధ దేశాలకు చెందిన రాజకీయ పార్టీల అధ్యక్షులు, మాజీ ప్రధానులు, మాజీ మంత్రులు, గవర్నర్లు, ఎంపీలు, రాయబారులు, విధాన నిర్ణేతలు, మేధావులు, సామాజికవేత్తలు ఈ వేదికపై తమ ఆలోచనలను పంచుకుంటున్నారు. తెలంగాణ అభివృద్ధి ప్రస్థానాన్ని అంతర్జాతీయ ప్రతినిధులకు పరిచయం చేయాలన్న లక్ష్యంతో ప్రత్యేకంగా 'తెలంగాణ రైజింగ్' పేరుతో చర్చలు నిర్వహిస్తున్నారు. పట్టణీకరణ, ఆర్థిక-సామాజిక న్యాయంపై మంత్రుల ప్రసంగాలు:తొలిరోజు పట్టణీకరణ, ఫ్యూచర్ సిటీ నిర్మాణంపై జరిగిన తొలి ప్యానల్ చర్చలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. పట్టణీకరణ, భవిష్యత్ అవసరాలు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై చర్చించడంతో పాటు ఫ్యూచర్ సిటీ ప్రణాళికలను మంత్రి ఆవిష్కరించారు. 'ఆర్థిక న్యాయం' అంశంపై జరిగిన రెండో ప్యానల్ చర్చలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొని ఆర్థిక అసమానతలు, అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలకు అందాల్సిన అవసరం, సమాన అవకాశాల కల్పనపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. మూడో అంశంగా జరిగిన సామాజిక న్యాయంపై ప్యానల్ చర్చలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని, తెలంగాణలో సామాజిక న్యాయం అమలు తీరుతో పాటు బీసీలు, ఇతర వెనుకబడిన



వర్గాలకు అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని వివరించారు. ఇక నాలుగో ప్యానల్‌గా జరిగిన సంక్షేమ విధానాలపై చర్చలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పాల్గొని, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వారి సామాజిక ఆర్థిక అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు.

రెండో రోజు కార్యక్రమాలకు రాహుల్‌గాంధీ రాక

ఈ సమ్మిట్‌కు వివిధ దేశాల నుంచి రావాల్సిన ప్రతినిధుల్లో కొందరు చివరి నిమిషంలో హాజరుకాలేకపోవడంపై నిర్వాహకులు కొంత ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇక రెండో రోజు కార్యక్రమాల్లో భాగంగా మరో నాలుగు 'తెలంగాణ రైజింగ్' అంశాలపై చర్చలు జరగనున్నాయి. సహకార సమాఖ్యవాదం, సంస్కృతి-సమాజం, యువత-క్రీడలు-రాజకీయాలు, ఎన్నికల సమగ్రత వంటి అంశాలు చర్చకు రానుండగా, అంతర్జాతీయ ప్రతినిధులు వీటిపై తమ అనుభవాలు, అభిప్రాయాలను పంచుకోనున్నారు. రెండో రోజు కార్యక్రమాలకు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ సహా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు.

పెట్టుబడులకు తెలంగాణే గమ్యం

- ప్రపంచానికి చాటేందుకే భారత్ సమ్మిట్!
- రాష్ట్రాన్ని అంతర్జాతీయ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- 70 దేశాల నుంచి వెయ్యి మంది ప్రతినిధులకు ఆహ్వానం
- డిసెంబర్ 7 నుంచి ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్
- తెలంగాణకు విదేశీ ప్రతినిధులే బ్రాండ్ అంబాసిడర్లు కావాలి
- గిగ్ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక విధానం
- రాహుల్‌గాంధీని ఆహ్వానించాం.. సదస్సుపై దుష్ప్రచారం తగదు
- 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం



హైదరాబాద్, నవంబర్ 13 (సమయం న్యూస్): రాష్ట్రంలో ఉన్న అద్భుతమైన మౌలిక సదుపాయాలు, సమృద్ధిగా ఉన్న మానవ వనరులు, పరిశ్రమల స్థాపనకు అనువైన వాతావరణం నేపథ్యంలో తెలంగాణ పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన ప్రాంతమని ప్రపంచానికి చాటిచెప్పడానికే ప్రభుత్వం 'భారత్ సమ్మిట్' నిర్వహిస్తోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న ఈ సదస్సు నేపథ్యంలో శుక్రవారం బోధి పెవిలియన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, మహమ్మద్ అజారుద్దీన్, కేంద్ర విదేశాంగ శాఖ మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, పలువురు ఎంపీలు పాల్గొన్నారు.వచ్చే నెల డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026'కు సన్నాహకంగా, తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న సానుకూల పరిస్థితులను ప్రపంచానికి వివరించేందుకే ఈ భారత్ సమ్మిట్ ఏర్పాటు చేశామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. పెట్టుబడులను ఆహ్వానించడంలో తమ ప్రభుత్వం అత్యంత స్పష్టమైన విధానంతో ముందుకు వెళ్తోందని తెలిపారు. ఈ సదస్సుకు జాతీయ స్థాయి ప్రముఖులే కాకుండా దాదాపు 70 దేశాలకు చెందిన వివిధ రంగాల్లో నిష్ణాతులైన ప్రతినిధులు, మంత్రులు, పర్యావరణవేత్తలు, పెట్టుబడిదారులు, జర్నలిస్టులు కలిపి సుమారు వెయ్యి మంది హాజరయ్యారని పేర్కొన్నారు. రెండు రోజులపాటు జరిగే సెమినార్లు, చర్చలు, తీర్మానాల ద్వారా తెలంగాణలోని ప్రజాస్వామిక, పెట్టుబడుల అనుకూల వాతావరణాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్నామన్నారు. సదస్సు ముగిశాక తిరిగి వెళ్లే ఈ అంతర్జాతీయ ప్రతినిధులందరూ తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారుతారని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

గిగ్ వర్కర్లకు రక్షణగా దేశంలోనే అత్యుత్తమ పాలసీ

సదస్సులో ప్రధానంగా పర్యావరణం, మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడులు, మానవ వనరులు, వాతావరణం వంటి కీలక అంశాలపై మేధో మథనం జరుగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రజాస్వామ్యంలో చర్చలు, సంప్రదింపుల ద్వారానే ఉత్తమ విధానాలను రూపొందించవచ్చన్నారు. ఇదే సమయంలో, దేశవ్యాప్తంగా గిగ్ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ.. ప్లాట్‌ఫామ్ వర్కర్లు, కొరియర్లు, డ్రైవర్లు, ఇళ్లల్లో పనిచేసే కార్మికులకు సరైన సామాజిక భద్రత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సంక్షేమం, రక్షణ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే అత్యుత్తమ 'గిగ్ వర్కర్స్ పాలసీ'ని తీసుకొచ్చిందని చెప్పారు. ఈ పాలసీ ఆవిష్కరణ కార్యక్రమానికి లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని ప్రత్యేకంగా ఆహ్వానించామని, భారత్ సమ్మిట్‌లోనూ ఆయన పాల్గొని తన సందేశాన్ని వినిపిస్తారని వెల్లడించారు.

అర్థరహిత ఆరోపణలతో అభివృద్ధిని అడ్డుకోవద్దు

ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' కర్టెన్ రైజర్ కార్యక్రమానికి కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను కూడా ఆహ్వానించామని సీఎం గుర్తుచేశారు. గతంలో నాటి ప్రధాని రాజీవ్ గాంధీ సైతం ప్రతిపక్ష నేత అటల్ బిహారీ వాజ్‌పేయిని దేశ ప్రతినిధిగా విదేశాలకు పంపించిన సత్సాంప్రదాయాన్ని ప్రస్తావించారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాభివృద్ధి కోసం నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్‌ను గుడ్డిగా వ్యతిరేకించడం సమర్థనీయం కాదని ముఖ్యమంత్రి హితవు పలికారు. అర్థరహితమైన ఆరోపణలు, దుష్ప్రచారాలతో ప్రజలను పక్కదారి పట్టించవద్దని కోరారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడానికి, యువతకు భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి, సాంస్కృతికంగా, సాంకేతికంగా హైదరాబాద్ సాధించిన ప్రగతిని ప్రపంచానికి చాటిచెప్పడానికి ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నాలకు ఎవరూ అడ్డుపడొద్దని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

మోదీ నా ఫోన్ ట్యాప్ చేస్తున్నారు: రాహుల్ గాంధీ

ప్రధాని ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడుతున్నారని ఆరోపణ

ఆరోపణలకు ఆధారాలు ఫోన్‌లోనే ఉన్నాయని వ్యాఖ్య

మోదీతో ముఖాముఖి చర్చకు మరోసారి సవాల్

ఇన్‌స్టాగ్రామ్ ప్రశ్నోత్తరాల్లో రాహుల్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, నవంబర్ 13 (సమయం న్యూస్): ప్రధాని నరేంద్ర మోదీ తన ఫోన్‌ను ట్యాప్ చేస్తున్నారని లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. తన ఆరోపణలపై ప్రధాని బహిరంగ చర్చకు రావాలని మరోసారి సవాల్ విసిరారు. శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో నిర్వహించిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ఓ ప్రశ్నకు సమాధానంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి ఎలాంటి ఆధారాలను బహిరంగంగా వెల్లడించలేదు. విదేశీ శక్తుల నియంత్రణలో ప్రధాని మోదీ ఉన్నారంటూ గతంలో చేసిన ఆరోపణలకు ఆధారాలేమిటని ఓ వ్యక్తి ప్రశ్నించగా.. తన ఫోన్‌ను చూపిస్తూ అందులోనే ఆధారాలున్నాయని రాహుల్ పేర్కొన్నారు. తన ఫోన్ ట్యాప్ అవుతున్న విషయం ప్రధానికీ తెలుసని వ్యాఖ్యానించారు. మోదీ చర్చకు వస్తే ఎవరు విదేశీ శక్తుల ప్రభావంలో ఉన్నారు? ఎవరు దేశ వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు? అనే అంశాలతో పాటు తనకు తెలిసిన పలు విషయాలు బయటపడతాయని అన్నారు. ప్రధానితో ముఖాముఖి చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని రాహుల్ స్పష్టం చేశారు. గతంలోనూ పలు సందర్భాల్లో బహిరంగ చర్చకు రావాలని మోదీకి సవాల్ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. తాజా ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు రాజకీయంగా చర్చకు దారితీశాయి.



అక్రమ అండాల సేకరణ దందా గుట్టురట్టు

ఫెర్టిలిటీ కేంద్రాలపై క్రిమినల్ కేసులు నమోదు

బేగంపేట హాస్టల్‌లో 12 మంది మహిళలకు విముక్తి

హైదరాబాద్, నవంబర్ 13 (సమయం న్యూస్): నగరంలో అక్రమ అండాల సేకరణ దందా వెలుగులోకి రావడం కలకలం రేపుతోంది. ప్రముఖ ఫెర్టిలిటీ కేంద్రాలైన ఒయాసిస్, సద్గురు సెంటర్లపై పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. సద్గురు హెల్త్‌కేర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, సంస్థ డైరెక్టర్ డాక్టర్ గేదెల దుర్గారావుతో పాటు పలువురు ఏజెంట్లపై కేసులు నమోదయ్యాయి. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఫిర్యాదుతో ఈ వ్యవహారం బయటపడింది. బేగంపేటలోని అమి నీతా గర్ల్స్ హాస్టల్‌పై పోలీసులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి వివిధ రాష్ట్రాలకు చెందిన 12 మంది మహిళలను రక్షించారు. నిరుపేద మహిళలకు రూ.50 వేలు ఇస్తామంటూ ఆశచూపి ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తరలించినట్లు విచారణలో వెల్లడైంది. వైద్య పర్యవేక్షణ, నిబంధనలు లేకుండానే వారికి ప్రమాదకరమైన హార్మోన్ ఇంజెక్షన్లు ఇచ్చినట్లు గుర్తించారు. అండాల సేకరణలో ఏడు కంటే తక్కువ అండాలు వస్తే ఏజెంట్ల కమీషన్‌లో 50 శాతం కోత విధించేవారని తేలింది. ఎక్కువ అండాలు పొందాలనే ఉద్దేశంతో మహిళలకు పరిమితికి మించి హార్మోన్ డోసులు ఇచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇప్పటివరకు ఈ ముఠా సుమారు 66 మంది మహిళల నుంచి అండాలను సేకరించినట్లు అధికారులు గుర్తించారు. వీరిలో 19 మందికి సంబంధించిన రికార్డులను పూర్తిగా మాయం చేసినట్లు తేలింది. అనుమతులు లేని గచ్చిబౌలి, ఉప్పల్, మలక్‌పేట, టోలీచౌకిలోని క్లినిక్‌లకు అండాలను సరఫరా చేసినట్లు వెల్లడైంది. ఈ వ్యవహారంపై బీఎన్ఎస్, అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ (ఏఆర్‌టీ) చట్టాల కింద క్రైమ్ నంబర్ 426/2026తో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న అమిత్ శర్మ, నిఖత్ శర్మ, దీపిక సహా తొమ్మిది మంది ఏజెంట్ల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో త్వరలో కీలక పరిణామాలు: రేవంత్

- కేసులో అనూహ్య మలుపులు ఉంటాయని వెల్లడి
- మోదీతో భేటీ ఖేలో ఇండియా ఆహ్వానం కోసమే
- మియాపూర్ భూముల వేలంపై బీఆర్ఎస్ హెచ్చరికల వెనుక డబ్బులే లక్ష్యం
- కవిత ఇంటిపై డ్రోన్ ఎవరు ఎగరేశారో తెలియదు
- కిషన్‌రెడ్డిని ఆహ్వానించకపోవడానికి కారణం చెప్పిన సీఎం



హైదరాబాద్, నవంబర్ 13 (సమయం న్యూస్): హైదరాబాద్, నవంబర్ 13: తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో త్వరలోనే అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఈ కేసు కీలక మలుపులు తిరిగే అవకాశం ఉందని సంకేతాలిచ్చారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన ఆయన పలు రాజకీయ అంశాలపై స్పందించారు. కేంద్ర ప్రభుత్వం తన ఫోన్‌ను ట్యాప్ చేసినా తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, తాను మాట్లాడే ప్రతి విషయం బహిరంగంగానే ఉంటుందని వ్యాఖ్యానించారు.

కవిత ఇంటిపై డ్రోన్ ఎవరు ఎగరేశారో తెలియదు

ఖేలో ఇండియా క్రీడా పోటీలకు ఆహ్వానించేందుకే ఎల్లుండి ప్రధాని నరేంద్ర మోదీని కలవనున్నట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. మియాపూర్ భూముల వేలాన్ని అడ్డుకుంటామని బీఆర్ఎస్ చేస్తున్న హెచ్చరికల వెనుక ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయని ఆరోపించారు. గతంలో ఉద్యమ సమయంలో ల్యాంకో హిల్స్, పద్మాలయ భూముల విషయంలో బీఆర్ఎస్ పెద్దఎత్తున ఆందోళనలు చేసిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి విషయంలో డబ్బులు వసూలు చేసి మౌనం వహించిందని విమర్శించారు. ఎమ్మెల్సీ కవిత నివాసంపై డ్రోన్ ఎగరేసింది ఎవరనేది తనకు తెలియదని సీఎం స్పష్టం చేశారు. కవిత కుటుంబంలో జరుగుతున్న వివాదాల నేపథ్యంలోనే ఏదైనా జరిగి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. ఆ కుటుంబ సభ్యులే ఈ వ్యవహారాన్ని పరిష్కరించుకుంటారని పేర్కొన్నారు.

కిషన్‌రెడ్డిని అందుకే ఆహ్వానించలేదు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గడ్డం పెంచుకుంటే అది ఆయన మోకాళ్లకు అడ్డం వస్తుందే తప్ప తనకు ఎలాంటి ఇబ్బంది ఉండదని రేవంత్‌రెడ్డి వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. భారతీయుల ఆత్మ కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. స్వాతంత్ర్యానికి ముందు బీజేపీ లేదని, మరో 25 ఏళ్ల తర్వాత ఆ పార్టీ ఉనికి కూడా ఉండదని వ్యాఖ్యానించారు. ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్ కర్టెన్ రైజర్' కార్యక్రమానికి ఆహ్వానించినప్పటికీ కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ హాజరుకాలేదని సీఎం తెలిపారు. అందుకే భారత్ సమిట్‌కు వారిని ఆహ్వానించలేదని స్పష్టం చేశారు. కిషన్‌రెడ్డి వస్తానంటే తానే స్వయంగా వెళ్లి ఆహ్వానిస్తానని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

నిరుద్యోగులపై పోలీసుల దాడులప్పుడు ఎక్కడున్నారు?

- లగచర్లలో గిరిజన మహిళలను అవమానించినప్పుడు మీకు పట్టింపులేదు
- హెచ్‌సీయూ భూముల్లో చెట్లను నరికినా మీకు కనబడలేదు
- కేబీఆర్ పార్కును నాశనం చేస్తుంటే నోరు మెదపలేదు
- రాహుల్ ను ప్రశ్నించిన కేటీఆర్



హైదరాబాద్, నవంబర్ 13 (సమయం న్యూస్): ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఉద్యోగాల కోసం పోరాడుతున్న నిరుద్యోగ విద్యార్థులను పోలీసులతో గొంతు నులిమి, దాడులు చేయించినప్పుడు మీరు ఎక్కడున్నారు రాహుల్ గాంధీ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. లగచర్లలో గిరిజన మహిళలను వారి భూముల కోసం పోరాడుతున్నందుకు కొట్టినప్పుడు, దుస్తులు చింపి అవమానించినప్పుడు మీకు చలనం కలగలేదా? హైడ్రా బుల్డోజర్లతో కష్టపడి జీవిస్తున్న తెలంగాణ ప్రజల ఇళ్లను కూల్చివేస్తున్నప్పుడు మీరు ఢిల్లీలో నిద్రపోతున్నారా? కంచ గచ్చిబౌలి హెచ్‌సీయూ భూముల్లో రాత్రికి రాత్రే 10 వేలకు పైగా చెట్లను నరికివేసి, జింకలు, నెమళ్లు సహా విలువైన జీవవైవిధ్యాన్ని ధ్వంసం చేసినప్పుడు.. కేబీఆర్ పార్కును నాశనం చేస్తున్నప్పుడు మీ గొంతు ఎందుకు పెగల్లేదు?రాజ్యాంగబద్ధమైన ప్రక్రియలను అపహాస్యం చేస్తూ, పదిమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి కాంగ్రెస్‌లో చేర్చుకున్నప్పుడు మీరు ఎందుకు మౌనంగా ఉన్నారు? మహిళా ప్రజాప్రతినిధుల చీరలు లాగి, అసెంబ్లీ ఎదుటే దాడులు చేసినప్పుడు కనీసం ఒక్క మాటైనా మాట్లాడారా రాహుల్ గాంధీ? రైతుల ఆత్మహత్యలు, చేనేత కార్మికుల బలవన్మరణాలు, అర్ధరాత్రి వేళ జర్నలిస్టుల అరెస్టులు, కార్పొరేట్ అనుకూల విధానాలు, భూకబ్జాలపై మాట్లాడటానికి మీకు సమయం లేదా? మీ సొంత పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులే బహిరంగంగా అవినీతి గురించి మాట్లాడుతున్నారు. అయినా మీ నోరు ఎందుకు మెదపడం లేదు? అవసరమైనప్పుడు మౌనం వహించారు.. ఇప్పుడు మాత్రం తెలంగాణ ప్రజల సొమ్ము రూ.100 కోట్లతో ప్రచార ఆర్భాటం కోసం సిగ్గులేకుండా వచ్చారా? రాహుల్ గాంధీ గారూ.. రాష్ట్ర ప్రజల సొమ్ముతో ఈ ప్రచార పర్యటనలు చేయడానికి మీకు ఎవరు అధికారం ఇచ్చారు? ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం ఉందా అని కేటీఆర్ ప్రశ్నించారు.

కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని అడ్డుకుంటాం

- ప్రజా అవసరాల భూములను అమ్మే అధికారం ప్రభుత్వానికి లేదు
- 2013లో కాపాడిన భూములను మళ్లీ వేలం వేయడం దుర్మార్గం
- బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు



హైదరాబాద్, నవంబర్ 13 (సమయం న్యూస్): ప్రజా అవసరాల కోసం కేటాయించిన కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూములను వేలం వేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని అడ్డుకుంటామని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు హెచ్చరించారు. మూసాపేటలోని ట్రక్ పార్క్ భూములను శుక్రవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందంతో కలిసి పరిశీలించారు. స్థానికులు, ట్రక్ డ్రైవర్లు, కార్మికుల సమస్యలు తెలుసుకుని అనంతరం నిర్వహించిన ధర్నాలో మాట్లాడారు. 2013లో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ భూములను అమ్మేందుకు ప్రయత్నించినప్పుడు బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం కలిసి పోరాడి అడ్డుకున్నాయని గుర్తుచేశారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఒక్క గజం భూమి కూడా విక్రయించలేదని, ప్రజా అవసరాల కోసం పోలీస్ స్టేషన్లు, హెచ్ఎండీఏ నర్సరీ, ఆర్టీఓ కార్యాలయం, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ట్రక్ పార్కింగ్‌కు కేటాయించామని తెలిపారు. ఈ నెల 27న వేలం నిర్వహించేందుకు హెచ్ఎండీఏ నోటిఫికేషన్ ఇచ్చిందని, సర్వే నంబర్లు 121/ఈ నుంచి 141 వరకు, 146, 147, 155, 156, 157లోని భూములను అమ్మకానికి పెట్టిందని చెప్పారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ట్రక్ పార్కింగ్, నర్సరీ, ఆర్టీఓ కార్యాలయానికి కేటాయించిన స్థలాలు కూడా వేలం జాబితాలో ఉన్నాయని ఆరోపించారు. కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గాల మధ్య ఉన్న ఈ స్థలం చుట్టుపక్కల ప్రస్తుతం 10 లక్షల మంది నివసిస్తున్నారని, భవిష్యత్తులో జనాభా మరింత పెరగనుందని పేర్కొన్నారు. రోజూ వందలాది లారీలు, కంటైనర్లకు ఈ పార్కింగ్ స్థలం అవసరమని తెలిపారు. 1982లో ఎస్సీ, ఎస్టీ, పేద రైతుల నుంచి ప్రజా ప్రయోజనాల కోసం ఈ భూములను సేకరించారని, వాటిని ఇతర అవసరాలకు వినియోగించరాదని భూసేకరణ ఉత్తర్వుల్లో స్పష్టంగా ఉందని హరీశ్ రావు పేర్కొన్నారు. ఇదే విషయాన్ని హైకోర్టు, సుప్రీంకోర్టులో హెచ్ఎండీఏ అఫిడవిట్ల ద్వారా వెల్లడించిందని గుర్తుచేశారు. ఇప్పుడు వేలం వేయడం చట్టపరంగా ప్రశ్నార్థకమవుతుందని అన్నారు. భూములను విక్రయించే బదులు ఆసుపత్రి, పార్కు, విద్యాసంస్థలు నిర్మించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భూముల విక్రయాలపై కూడా హరీశ్ రావు ప్రభుత్వాన్ని విమర్శించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములు, మియాపూర్ భూములు, హౌసింగ్ బోర్డు స్థలాలు సహా వివిధ ప్రభుత్వ భూములను విక్రయించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని వెంటనే రద్దు చేయాలని, లేదంటే బీఆర్ఎస్, వామపక్షాలతో కలిసి న్యాయపోరాటం సహా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద గౌడ్, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, నవీన్ రావు, సీపీఐ, సీపీఎం నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి 5 లక్షల జీవిత బీమా

దేశంలోనే తొలి, ఏకైక రాష్ట్రంగా తెలంగాణ

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, నవంబర్ 13 (సమయం న్యూస్): రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియను దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఈ నెల 19న ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. కులం, మతం, ఆదాయంతో సంబంధం లేకుండా ప్రతి కుటుంబానికి ఈ పథకం వర్తిస్తుందని, దేశంలోనే ఈ విధానాన్ని అమలు చేస్తున్న తొలి, ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలవనుందని పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ కుటుంబంలో ఉపాధి పొందుతున్న వ్యక్తి మరణిస్తే ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలన్నదే పథకం ఉద్దేశమన్నారు. ప్రతి కుటుంబంలో ఒక ఉపాధి పొందే వ్యక్తికి బీమా వర్తిస్తుందని, పలువురు ఉపాధిలో ఉంటే ఎవరికి బీమా కల్పించాలనేది కుటుంబ సభ్యులే నిర్ణయించుకోవచ్చని తెలిపారు. ఒకరు లేదా పలువురు నామినీలను ఎంపిక చేసుకోవడంతోపాటు బీమా మొత్తాన్ని ఏ నిష్పత్తిలో పంపిణీ చేయాలన్నది కూడా వారే నిర్ణయించుకోవచ్చన్నారు. ఈ నెల 19 నుంచి గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో ఏకకాలంలో లబ్ధిదారుల నమోదు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. నమోదు సమయంలో బీమా పొందే వ్యక్తి, నామినీల వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని, కుటుంబ సభ్యులకు వివరాలు చదివి వినిపించి వారి అంగీకారం తీసుకోవాలని సూచించారు. పథకంపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 17, 18 తేదీల్లో టామ్‌టామ్ ద్వారా ప్రచారం నిర్వహించాలని, నమోదు కేంద్రాల వివరాలను ముందుగానే ప్రజలకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. సామాజిక, ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని భట్టి విక్రమార్క సూచించారు.





చేవెళ్లలో ఆర్మీ వాహనం బోల్తా

14 మంది జవాన్లకు గాయాలు.. ఎనిమిది మంది పరిస్థితి విషమం

హైదరాబాద్, నవంబర్ 13 (సమయం న్యూస్): రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం అల్లావాడ గేట్ సమీపంలో శుక్రవారం ఆర్మీ వాహనం ఘోర ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో 14 మంది జవాన్లు తీవ్రంగా గాయపడగా, వారిలో ఎనిమిది మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. గోల్కొండ ఆర్మీ క్యాంపు నుంచి శిక్షణలో భాగంగా షాబాద్ వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అల్లావాడ గేట్ సమీపంలో ఎదురుగా వేగంగా వచ్చిన కారును తప్పించబోయి డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయినట్లు తెలుస్తోంది. దీంతో ఆర్మీ వాహనం పలుమార్లు బోల్తాపడి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాహనం తీవ్రంగా దెబ్బతినగా, అందులో ఉన్న జవాన్లకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న స్థానికులు, పోలీసులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను బయటకు తీసి అంబులెన్స్‌ల ద్వారా శంషాబాద్‌లోని ఆర్కానో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రితోపాటు ఆర్మీ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంతో చేవెళ్ల ప్రధాన రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు వాహనాన్ని తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

ఎల్‌నినో ప్రభావంపై ప్రభుత్వ ప్రత్యేక దృష్టి

భూగర్భ జలాల పరిస్థితిపై ఉత్తమ్ సమీక్ష

ఈ నెల 15న ప్రధాని మోదీతో భేటీ

కేంద్రం నుంచి ప్రత్యేక ఆర్థిక సాయం కోరనున్న సీఎం, మంత్రి

జల సంరక్షణకు తక్షణ, దీర్ఘకాలిక ప్రణాళికలు



హైదరాబాద్, నవంబర్ 13 (సమయం న్యూస్): రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, భూగర్భ జలాల పరిస్థితిపై తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సచివాలయంలో భూగర్భ జల శాఖ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఈ సమావేశంలో సీఎస్ఐఆర్-ఎన్ఈఐఎస్‌టీ డైరెక్టర్, భూగర్భ జలాల నిపుణుడు డాక్టర్ వీరేంద్ర ఎం. తివారీ పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ నెల 15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి ప్రధాని నరేంద్ర మోదీని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కలవనున్నారు. రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులు, దాని ప్రభావాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లి, ముప్పును ఎదుర్కొనేందుకు ప్రత్యేక ఆర్థిక సాయం కోరనున్నట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలమట్టాలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. నీటిమట్టాలు తగ్గుతున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రభుత్వానికి నివేదికలు అందించాలని సూచించారు. వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు తక్షణ, దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. జల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారుల సలహాలను కూడా కోరారు. ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయం, తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఆటో రిక్షా కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు

ఆటో నగర్ కాలనీ ఏర్పాటుకు ప్రభుత్వ ఆమోదం

రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి

హైదరాబాద్, నవంబర్ 13 (సమయం న్యూస్): నగరంలో ప్రజా రవాణా వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న ఆటో రిక్షా కార్మికుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. సమాజంలోని పేద, బలహీనవర్గాలకు సొంతింటి భరోసా కల్పించడంతోపాటు, గుడిసెలు లేని తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న ఆటోరిక్షా కార్మికుల సొంతింటి కలను సాకారం చేసేందుకు హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఆటో నగర్ కాలనీ పేరుతో సరసమైన గృహ నిర్మాణ పథకానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని మంత్రి వెల్లడించారు. నిరంతరం ప్రజలకు రవాణా సేవలు అందిస్తూ నగర జీవనంలో కీలక భాగస్వాములుగా ఉన్న ఆటో కార్మికుల కుటుంబాలకు శాశ్వత నివాస భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. హైదరాబాద్ కోర్ పరిధిలోని బండ్లగూడ, గంధంగూడ, పేట్‌బషీరాబాద్, జల్‌పల్లి/లక్ష్మిగూడ ప్రాంతాల్లో ఈ గృహ నిర్మాణ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు తెలిపారు. ఒక్కో ప్రాంతంలో 500 ఫ్లాట్ల చొప్పున మొత్తం 2,000 ఆధునిక ఫ్లాట్లను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు అమలుకు సంబంధించి ఆయా ప్రాంతాల్లో స్థలాల లభ్యత, సాంకేతిక అంశాలు, భౌగోళిక అనుకూలతలను క్షుణ్ణంగా పరిశీలించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించడంతోపాటు ఆర్థిక ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని హౌసింగ్ బోర్డు అధికారులను ఆదేశించినట్లు మంత్రి వివరించారు. అవసరమైన ప్రక్రియలను వేగవంతం చేసి అర్హులైన ఆటో కార్మిక కుటుంబాలకు వీలైనంత త్వరగా గృహ వసతి కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలోని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. పేదల సంక్షేమమే ప్రాధాన్యంగా వివిధ వర్గాల అవసరాలను గుర్తించి ప్రత్యేక గృహ నిర్మాణ కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ఇందులో భాగంగానే ఆటోరిక్షా కార్మికుల కోసం ఆటో నగర్ కాలనీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

సంపాదకీయం



సంక్షేమ పంపిణీలో నవశకం!

నిధుల పక్కదారికి ఈ-రూపీతో పూర్తి అడ్డుకట్ట

బ్యాంకు ఖాతా, ఇంటర్నెట్ లేకున్నా ప్రయోజనం

లబ్ధిదారుడి ఫోన్‌కే నేరుగా డిజిటల్ వోచర్

నిర్దేశించిన అవసరానికి మాత్రమే వాడుకునే వీలు

సైబర్ భద్రత, డిజిటల్ అవగాహనే కీలకం

డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వైపు భారత్ శరవేగంగా అడుగులు వేస్తున్న తరుణంలో సంక్షేమ పథకాల అమలులో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఒకప్పుడు ప్రభుత్వం పేదల కోసం ఒక్క రూపాయి విడుదల చేస్తే దళారుల చేతివాటంతో లబ్ధిదారుడికి కేవలం పదిహేను పైసలు మాత్రమే చేరేవన్న విమర్శలు ఉండేవి. ఆ తర్వాత వచ్చిన జన్‌ధన్, ఆధార్, మొబైల్ (జామ్) అనుసంధానంతో ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) విధానం అమల్లోకి వచ్చి మధ్యవర్తుల బెడద తప్పింది. అయితే బ్యాంకు ఖాతాల్లో నేరుగా పడుతున్న నగదు నిజంగానే నిర్దేశించిన ప్రయోజనం కోసమే ఖర్చవుతోందా అన్నది ఇప్పటికీ పెద్ద ప్రశ్నగానే మిగిలిపోయింది. సరిగ్గా ఈ లోపాన్ని సవరించి, సంక్షేమ పంపిణీలో నూటికి నూరు శాతం పారదర్శకత తెచ్చేందుకే నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ఆధ్వర్యంలో 'ఈ-రూపీ' అనే సరికొత్త డిజిటల్ వోచర్ వ్యవస్థ రూపుదిద్దుకుంది. ప్రభుత్వమైనా, ప్రైవేటు సంస్థలైనా తాము అందించాలనుకున్న ఆర్థిక సహాయాన్ని ఒక నిర్దిష్ట ప్రయోజనం కోసం మాత్రమే వినియోగించేలా లబ్ధిదారులకు ఈ ప్రీపెయిడ్ వోచర్లను జారీ చేయవచ్చు.

అసలు ఎలా పనిచేస్తుంది..

ఈ-రూపీ అనేది పూర్తిగా నగదు రహిత, కాంటాక్ట్‌లెస్ డిజిటల్ చెల్లింపుల వేదిక. ఇందులో లబ్ధిదారుడి మొబైల్ ఫోన్‌కు నేరుగా ఒక క్యూఆర్ కోడ్ లేదా ఎస్ఎంఎస్ స్ట్రింగ్ రూపంలో ఈ-వోచర్ వస్తుంది. దీనికున్న అతిపెద్ద ప్రత్యేకత ఏమిటంటే.. లబ్ధిదారుడికి అసలు బ్యాంకు ఖాతా గానీ, డెబిట్ కార్డు గానీ, మొబైల్ బ్యాంకింగ్ యాప్ గానీ ఉండాల్సిన అవసరమే లేదు. చివరికి స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్ సదుపాయం లేకపోయినా సరే సాధారణ ఫీచర్ ఫోన్‌కు వచ్చే ఎస్ఎంఎస్ కోడ్‌ను చూపించి సేవలు పొందవచ్చు. దేశంలో నేటికీ బ్యాంకింగ్ సేవలకు దూరంగా ఉన్న కోట్లాది మందిని ఆర్థిక స్రవంతిలోకి తీసుకురావడానికి ఇదొక తిరుగులేని ఆయుధం. ఉదాహరణకు గర్భిణులకు పోషకాహారం కోసమో, క్షయ (టీబీ) రోగులకు మందుల కోసమో, రైతులకు ఎరువుల రాయితీ కోసమో ప్రభుత్వం డబ్బులు ఇస్తే.. ఆ నిధులు మద్యం తాగడానికో, ఇతర కుటుంబ ఖర్చులకో మళ్లిపోయే ప్రమాదం గతంలో ఉండేది. కానీ ఈ-రూపీ వోచర్‌ను మాత్రం ప్రభుత్వం అనుమతించిన ఆసుపత్రిలో, మందుల దుకాణంలో లేదా ఎరువుల కేంద్రంలో మాత్రమే వాడుకోవాల్సి ఉంటుంది. అక్కడ లబ్ధిదారుడు తన ఫోన్‌లోని కోడ్ చూపించగానే నిర్వాహకులు దాన్ని స్కాన్ చేసి, ఓటీపీ ద్వారా ధ్రువీకరించుకుని నిర్దేశిత వస్తువు లేదా సేవను అందిస్తారు.

విస్తృత ప్రయోజనాలు.. స్పష్టమైన తేడా..

ఈ విధానం కేవలం ప్రభుత్వ సంక్షేమ పథకాలకే పరిమితం కాదు. ఆరోగ్యం, విద్య, పోషకాహారం, వ్యవసాయం, నైపుణ్యాభివృద్ధి లాంటి ఎన్నో రంగాల్లో దీన్ని అద్భుతంగా వినియోగించుకోవచ్చు. విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్‌లు, ఉపకార వేతనాల పంపిణీలో అక్రమాలకు తావుండదు. ప్రైవేటు కార్పొరేట్ సంస్థలు కూడా తమ ఉద్యోగుల ఆహార, ఆరోగ్య భత్యాల కోసం, సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమాల కింద పేదలకు సాయం చేసేందుకు ఈ వోచర్లను కొనుగోలు చేసి ఇవ్వవచ్చు. మరోవైపు చాలా మంది ఈ-రూపీని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) జారీ చేసే డిజిటల్ రూపాయితో (సీబీడీసీ) కలిపి చూస్తుంటారు. కానీ ఈ రెండింటికీ స్పష్టమైన తేడా ఉంది. ఆర్‌బీఐ ఇచ్చే డిజిటల్ రూపాయి అనేది మన జేబులో ఉండే కరెన్సీ నోటుకు ప్రత్యామ్నాయమైన చట్టబద్ధమైన డిజిటల్ కరెన్సీ. దాన్ని ఎక్కడైనా, ఏ అవసరానికైనా వాడుకోవచ్చు. కానీ ఈ-రూపీ అనేది కేవలం ఏ వ్యక్తికైతే జారీ చేశారో ఆ వ్యక్తి మాత్రమే, ఏ పని కోసమైతే ఇచ్చారో ఆ పనికి మాత్రమే వాడుకునే ఒక డిజిటల్ కూపన్.

సవాళ్లను అధిగమిస్తేనే సత్ఫలితాలు..

ఆశయం ఎంత గొప్పదైనా క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించినప్పుడే ఏ సాంకేతికతకైనా సార్థకత చేకూరుతుంది. కేవలం డిజిటల్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చినంత మాత్రాన సరిపోదు. మారుమూల గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఈ వోచర్లను స్వీకరించే వ్యాపార, సేవా కేంద్రాల నెట్‌వర్క్‌ను విస్తృతం చేయాలి. నిరక్షరాస్యులు, వృద్ధులు తమ ఫోన్‌కు వచ్చిన ఎస్ఎంఎస్ కోడ్‌ను, ఓటీపీని సైబర్ నేరగాళ్ల చేతిలో పెట్టకుండా ఉండేలా విస్తృత అవగాహన కల్పించాలి. ఫోన్ పోయినా, మెసేజ్ డిలీట్ అయినా తిరిగి ఆ వోచర్‌ను పొందేలా గ్రామ స్థాయిలో సులభతరమైన ప్రత్యామ్నాయ సహాయక కేంద్రాలు ఏర్పాటు చేయాలి. అలాగే కోట్లాది మంది లబ్ధిదారుల వ్యక్తిగత సమాచార గోప్యతకు భంగం కలగకుండా పటిష్టమైన సైబర్ భద్రతా కవచాన్ని నిర్మించాలి. ప్రభుత్వం ఇచ్చే ప్రతి పైసా సరైన వ్యక్తికి, సరైన సమయంలో, సరైన ప్రయోజనం కోసం చేరాలన్న లక్ష్యాన్ని ఈ-రూపీ నిజం చేయగలదు. సాంకేతికతకు పారదర్శకమైన నియంత్రణ, ప్రజల్లో చైతన్యం తోడైతే భారత సంక్షేమ పంపిణీ చరిత్రలో ఈ-రూపీ ఒక సువర్ణాధ్యాయంగా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

మహిళా కోటాపై కేంద్రం పట్టు

- మరోసారి డీలిమిటేషన్ బిల్లు!
- రాజ్యాంగ సవరణ బిల్లుల ఆమోదానికి కేంద్రం కసరత్తు
- ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల నిర్వహణపై చర్చ
- మూడింట రెండొంతుల మెజారిటీ సాధిస్తామన్న ధీమా
- అవసరమైన మెజారిటీ కంటే 15-18 ఓట్లు అదనంగా వస్తాయని అంచనా
- లోక్‌సభ స్థానాలను 543 నుంచి 850కి పెంచే ప్రతిపాదన
- 2029 ఎన్నికల నాటికి మహిళలకు 33 శాతం రిజర్వేషన్లే లక్ష్యం
- దక్షిణాది రాష్ట్రాల అభ్యంతరాల పరిష్కారంపైనా దృష్టి



న్యూఢిల్లీ, నవంబర్ 13 (సమయం న్యూస్): పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు వీలుగా నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లును తీసుకురావడంపై కేంద్ర ప్రభుత్వం ముమ్మర కసరత్తు ప్రారంభించింది. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం, ఈ కీలక రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదింపజేసుకునేందుకు త్వరలోనే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే మహిళా కోటాను అమలులోకి తీసుకురావాలని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. రాజ్యాంగ సవరణ బిల్లులు పార్లమెంట్‌లో ఆమోదం పొందాలంటే లోక్‌సభలో మూడింట రెండొంతుల మెజారిటీ, అంటే కనీసం 361 మంది సభ్యుల మద్దతు తప్పనిసరి. ఇందుకోసం తెరవెనుక విపక్షాలు, ఇతర పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈసారి బిల్లు ఆమోదానికి అవసరమైన 361 ఓట్ల కన్నా అదనంగా మరో 15 నుంచి 18 ఓట్లు తమకు లభిస్తాయని ఎన్డీయే వర్గాలు పూర్తి ధీమా వ్యక్తం చేస్తున్నాయి. గతంలో ఏప్రిల్ 17న బడ్జెట్ సమావేశాల ప్రత్యేక భేటీలో భాగంగా మహిళా రిజర్వేషన్ల రాజ్యాంగ సవరణ బిల్లును ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. అయితే, ఆ సమయంలో బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు రావడంతో మూడింట రెండొంతుల మెజారిటీ లభించక ఆ బిల్లు వీగిపోయింది. మరోవైపు, ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా పడిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను ఇప్పటివరకు అధికారికంగా ప్రొరోగ్ (ముగింపు) చేయలేదు. దీనివల్ల ఎప్పుడైనా పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి వెసులుబాటు ఏర్పడింది. దక్షిణాది రాష్ట్రాల అభ్యంతరాల పరిష్కారానికి ప్రణాళిక: డీలిమిటేషన్ ప్రక్రియలో భాగంగా లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న 543 ఎంపీ స్థానాలను ఏకంగా 850కి పెంచాలని కేంద్రం యోచిస్తున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో జనాభా నియంత్రణను సమర్థవంతంగా పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభలో ప్రాతినిధ్యం తగ్గిపోతుందంటూ దక్షిణాది నేతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అభ్యంతరాలను పరిష్కరించేందుకు కేంద్రం పలు ప్రతిపాదనలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతి రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఎంపీ స్థానాలను 50 శాతం మేర పెంచడం లేదా రాష్ట్రాల మధ్య ప్రస్తుతం ఉన్న సీట్ల నిష్పత్తిని 1971 జనాభా లెక్కల ఆధారంగానే యథాతథంగా కొనసాగించడం వంటి అంశాలపై చర్చలు జరుగుతున్నాయి. అయితే, ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల తేదీలపై ప్రభుత్వం నుంచి ఇంకా అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

అస్సాంలో మృత్యుఘోష

ట్రక్కు-మినీ బస్సు ఢీకొని 23 మంది దుర్మరణం! ■ కాజిరంగ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

గువాహటి/కాజిరంగ, నవంబర్ 13 (సమయం న్యూస్): అస్సాంలోని కాజిరంగ జాతీయ ఉద్యానవనం సమీపంలో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. జాతీయ రహదారి-715పై రొంగాజన్ (హతికులి టీ ఎస్టేట్) ప్రాంతంలో ప్రయాణికులతో వెళ్తున్న మినీ బస్సు (ట్రావెలర్), ఎదురుగా వస్తున్న భారీ కంటైనర్ ట్రక్కు అత్యంత వేగంతో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ పెను విషాదంలో 23 మంది ప్రయాణికులు దుర్మరణం పాలవగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద తీవ్రతకు మినీ బస్సు పూర్తిగా నుజ్జునుజ్జు కాగా, మరణించిన వారిలో ఎక్కువ మంది కళాశాల విద్యార్థులే ఉన్నట్లు తెలుస్తోంది. గోలాఘాట్ జిల్లాలోని బొకాఖాట్ నుంచి పొరుగు జిల్లా అయిన నగావ్ వైపు వెళ్తున్న మినీ బస్సును, తేజ్‌పూర్ నుంచి దిబ్రూగఢ్ వైపు వెళ్తున్న కంటైనర్ ట్రక్కు ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టారు. బస్సు శిథిలాల్లో చిక్కుకున్న మృతదేహాలను బయటకు తీస్తున్నామని, 23 మంది మృతి చెందినట్లు ప్రాథమికంగా నిర్ధారించామని గోలాఘాట్ సీనియర్ ఎస్పీ స్వప్ననీల్ దేకా వెల్లడించారు. గాయపడిన వారిని తొలుత కోహోరా మోడల్ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉన్నవారిని మెరుగైన చికిత్స కోసం గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేసి జోర్హాట్ మెడికల్ కాలేజ్ ఆస్పత్రికి తరలించారు. కాజిరంగ నేషనల్ పార్క్ సమీపంలో వాహన వేగంపై ఉన్న నిబంధనలను ఉల్లంఘిస్తూ మినీ బస్సు అతివేగంతో ప్రయాణించిందని, డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. కాగా, ప్రమాదానికి గురైన ఈ వాహనంపై గతంలోనే ఓవర్‌స్పీడింగ్‌కు సంబంధించి పలు చలాన్లు ఉన్నట్లు విచారణలో తేలింది. ఈ ఘోర దుర్ఘటనపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ సర్మ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ఆయన, క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యే అతుల్ బోరా స్వయంగా ప్రమాద స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. శిథిలాల కింద మరికొందరు చిక్కుకుని ఉండే అవకాశం ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఒక నగ్న ఫొటోకు.. ఓ యుద్ధ ప్లాన్ లీక్..

- పాక్ గూఢచారితో ఐఏఎఫ్ అధికారి బేరం!
- పాక్ యువతి వలపు వలలో చిక్కుకుని దేశ రహస్యాలను తాకట్టు పెట్టిన వింగ్ కమాండర్
- రహస్య డ్రోన్ యూనిట్లు, యుద్ధ విమానాల మోహరింపు సమాచారాన్ని లీక్ చేసిన వైనం
- సబ్‌ఆర్డినేట్‌ల ఫోన్లలోనూ మాల్‌వేర్ యాప్ ఇన్‌స్టాల్ చేయించిన నిందితుడు
- కోర్టులో ఢిల్లీ పోలీసులు దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో విస్తుపోయే వాస్తవాలు వెల్లడి



న్యూఢిల్లీ, నవంబర్ 13 (సమయం న్యూస్): పాకిస్థాన్ గూఢచారి వలపు వలలో (హనీ ట్రాప్) చిక్కుకున్న భారత వాయుసేన (ఐఏఎఫ్) అధికారి ఒకరు అత్యంత కీలకమైన దేశ రక్షణ రహస్యాలను శత్రువుల చేతికి అందజేశారు. కేవలం ఆ యువతి పంపే నగ్న చిత్రాల కోసం దేశ భద్రతకు సంబంధించిన యుద్ధ ప్రణాళికలు, సైనిక మోహరింపు సమాచారాన్ని బేరం పెట్టిన సంచలన ఉదంతం వెలుగులోకి వచ్చింది. కొన్ని నెలల క్రితం అరెస్టయిన ఈ అధికారిపై ఢిల్లీ పోలీసులు తాజాగా కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేయడంతో ఈ విస్తుపోయే వాస్తవాలు బయటపడ్డాయి.

వాట్సప్‌లో వేలాది సందేశాలు.. రహస్యాల లీక్:

భారత వాయుసేనలో వింగ్ కమాండర్‌గా పనిచేస్తున్న నిందితుడికి ఆన్‌లైన్ వేదికగా సదరు పాక్ గూఢచారితో పరిచయం ఏర్పడింది. ఈ ఏడాది జనవరి 12 నుంచి ఏప్రిల్ 1 మధ్య వీరిద్దరూ వాట్సప్‌లో నిరంతరం సంభాషణలు సాగించారు. ఈ క్రమంలో దాదాపు 3,000లకు పైగా టెక్ట్ సందేశాలు, 65 ఫొటోలు పంపించుకున్నట్లు దర్యాప్తులో తేలింది. అంతేకాకుండా వీరి మధ్య 42 వాయిస్ కాల్స్, నాలుగు వీడియో కాల్స్ జరగగా, ఆరు యూఆర్ఎల్స్‌ను కూడా పరస్పరం షేర్ చేసుకున్నారు. భారత్ వద్ద ఉన్న డ్రోన్ సామర్థ్యాలు, సీక్రెట్ డ్రోన్ యూనిట్, సైనిక స్థావరాల వివరాలు, సరిహద్దుల్లో ఉద్రిక్తతల వేళ ముందుగా మోహరించే యుద్ధ విమానాల వంటి అత్యంత సున్నితమైన సమాచారాన్ని సదరు అధికారి పాక్ గూఢచారికి చేరవేశారు.

ఒక్కో నగ్న ఫొటోకు.. ఒక్కో వార్ ప్లాన్ పేజీ:

ఈ వ్యవహారంలో అధికారి వ్యవహరించిన తీరు దర్యాప్తు అధికారులనే విస్మయానికి గురిచేసింది. ఆ గూఢచారి తన నగ్న చిత్రాన్ని పంపిన ప్రతిసారీ, నిందితుడు మన సీక్రెట్ వార్ ప్లాన్‌కు సంబంధించిన ఒక్కో పేజీని ఆమెకు షేర్ చేసినట్లు పోలీసులు ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. ఆమె పంపే ప్రతి నగ్న ఫొటోకు బదులుగా యుద్ధ ప్రణాళికకు సంబంధించిన కొత్త పేజీని పంపిస్తానని అతడు ఆఫర్ ఇచ్చినట్లు తేలింది. వీటితో పాటు లేహ్‌లోని యుద్ధ విమానాల మోహరింపు, సూరత్‌గఢ్‌లోని మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ వద్ద జరిగే మిలిటరీ విన్యాసాల వివరాలను కూడా లీక్ చేశాడు. అంతేకాకుండా, పాక్ గూఢచారి పంపిన ఒక ప్రమాదకరమైన మాల్‌వేర్ యాప్‌ను తన కింద పనిచేసే సబ్‌ఆర్డినేట్ సిబ్బంది డివైజ్‌లలోనూ ఇన్‌స్టాల్ చేయించినట్లు దర్యాప్తులో బయటపడింది.

స్మార్ట్‌ఫోన్‌తో దొరికిపోయిన వైనం:

ఈ అధికారి దేశద్రోహ చర్యలు మే నెలలోనే వెలుగులోకి వచ్చాయి. నిబంధనలకు విరుద్ధంగా ఓసారి కార్యాలయంలోకి స్మార్ట్‌ఫోన్ తీసుకొచ్చిన అతడిని భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. తనిఖీల్లో అనుమానాస్పద అంశాలు గుర్తించిన ఎయిర్‌ఫోర్స్ అధికారులు వెంటనే సదరు వింగ్ కమాండర్‌పై ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన ఢిల్లీ పోలీసులు మే 30న అతడిని అరెస్టు చేసి తీహాడ్ జైలుకు తరలించారు. లోతైన దర్యాప్తు అనంతరం తాజాగా కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు.

మాట ఇచ్చాం.. అభివృద్ధితో నిరూపిస్తున్నాం!

- **జీవోలు, ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పనులు చేపడుతున్నాం... ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**
- **రూ.2.33 కోట్లతో మూడు డివిజన్లలో రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన**

హన్మకొండ, నవంబరు 13 (సమయం న్యూస్)



ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. అభివృద్ధి అంటే జీవోలు తీసుకురావడం, పత్రికా ప్రకటనలు ఇవ్వడం, సమావేశాలు నిర్వహించడం మాత్రమే కాదని, క్షేత్రస్థాయిలో పనులు చేపట్టి ప్రజలకు ఫలితాలు చూపించడమే నిజమైన అభివృద్ధి అని పేర్కొన్నారు.నియోజకవర్గంలోని 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్, 63వ డివిజన్ తిలక్‌నగర్, 8వ డివిజన్ మార్కస్ స్కూల్ ఆవరణలో సుమారు రూ.2.33 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అంతర్గత రహదారులు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రారంభించిన పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, నాణ్యతా ప్రమాణాల్లో రాజీ పడకుండా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.వరంగల్ నగరంలో రాబోయే 30 నుంచి 40 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని తాగునీరు, మురుగు నీటి వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల నేపథ్యంలో భవిష్యత్తులో మళ్లీ రహదారులను తవ్వాల్సిన పరిస్థితి రాకుండా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనులు చేపట్టాలని సూచించారు.నగర భవిష్యత్తు తాగునీటి అవసరాల కోసం సుమారు రూ.550 కోట్లతో 4 నుంచి 8 అంగుళాల పైప్‌లైన్ వ్యవస్థను విస్తరించే ప్రణాళిక ఉందన్నారు. వడ్డేపల్లి ఫిల్టర్‌బెడ్ సామర్థ్యాన్ని పెంచి రానున్న మూడు, నాలుగు దశాబ్దాల అవసరాలకు సరిపడా మౌలిక వసతులు కల్పించనున్నట్లు వివరించారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వరంగల్ అభివృద్ధికి అవసరమైన పలు కీలక ప్రాజెక్టులను సాధించామని తెలిపారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, విమానాశ్రయం, తాగునీటి పైప్‌లైన్ విస్తరణ వంటి ప్రాజెక్టులు ముందుకు సాగుతున్నాయని, నగర అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించి నిధులు, అనుమతుల విషయంలో సహకరిస్తున్నారని పేర్కొన్నారు.గత పదేళ్ల పాలనకు, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని కోరారు. ప్రతిపక్షాలు విమర్శలకే పరిమితం కాకుండా నిర్మాణాత్మక సూచనలు ఇవ్వాలని, అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని హితవు పలికారు.ఎన్నికలు ఉన్నప్పుడే ప్రజల మధ్యకు వచ్చే నాయకులం కాదని, నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రతిరోజూ రెండు డివిజన్లలో పర్యటించి సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారానికి కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. గత పదేళ్లలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులపై బహిరంగ చర్చకు సిద్ధమని, ఖర్చు చేసిన నిధుల వివరాలను లెక్కలతో సహా ప్రజల ముందు ఉంచుతానని అన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని నాయిని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఆయా డివిజన్ల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

ప్రతీ నీటి చుక్కా ఓ అమూల్య నిధి..

- **భావితరాల కోసం నీటిని పొదుపు చేయాలి!**
- **నీటి వృథాను అరికడతామని చిన్నారులతో ప్రతిజ్ఞ చేయించిన డాక్టర్ అనితా రెడ్డి**

హనుమకొండ, నవంబర్ 13 (సమయం న్యూస్)



నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, భవిష్యత్తు తరాలకు నీటి కొరత లేకుండా ఉండాలంటే ప్రతి నీటి చుక్కనూ పొదుపు చేయాలని కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి అన్నారు.ఆమె ఆధ్వర్యంలో బాల సముద్రంలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్, ఆనంద నిలయం హాస్టళ్లలో శుక్రవారం నీటి పొదుపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు సరిగా కురవక భూగర్భ జలాలు తగ్గిపోతుండటంతో అనేక ప్రాంతాల్లో నీటి కొరత ఏర్పడుతోందన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణ, పొదుపుపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.హాస్టళ్లలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉంటున్నేపథ్యంలో నీటి వృథాను అరికట్టేందుకు చిన్నారులకు ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కాలనీ వాసులకు సైతం నీటి పొదుపుపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అవసరమైన మేరకే నీటిని వినియోగించాలని, ఇళ్లలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, వివిధ మొక్కలు నాటాలని సూచించారు.నీటిని నిర్లక్ష్యంగా వృథా చేస్తే భవిష్యత్తు తరాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుత వినియోగదారులుగా మారి అనవసరపు నీటి వినియోగాన్ని తగ్గించాలని పిలుపునిచ్చారు. నీటి పునర్వినియోగం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని కోరారు.అనంతరం హాస్టల్ విద్యార్థులతో నీటిని వృథా చేయకుండా, ప్రతి నీటి చుక్కనూ సంరక్షిస్తామని డాక్టర్ అనితా రెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సరిత, రాఘవ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులలో , వ్యాయామ విద్యను బలోపేతం చేయాలి

- **పెటా తెలంగాణ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బియ్యని కృష్ణయ్య**

ఖమ్మం, నవంబర్ 13 : (సమయం న్యూస్)



ప్రభుత్వ బడులలో వ్యాయామ విద్యను బలోపేతం చేయాలని పేట తెలంగాణ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బియ్యని కృష్ణయ్య డిమాండ్ చేస్తున్నారు. వ్యాయామ విద్యను బలోపేతం ఏ విధంగా చేయాలో ఆయన వివరిస్తున్నారు.

1. అర్హత కలిగిన పీఈటీ లకు వెంటనే పదోన్నతులు కల్పించాలి.
2. బి పి ఈ డి అర్హత లేని వారు 12 సంవత్సరాల ఇంక్రిమెంట్ తీసుకోలేక తీవ్రంగా నష్టపోతున్నారు. వారికి వెంటనే ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ టెస్ట్ (పి ఎ టి) టెస్ట్ నిర్వహించాలి.
3. రాష్ట్రం లో చాలా స్కూల్ లలో విద్యార్థుల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది కొన్ని చోట్ల 300 దాటింది, కొన్ని చోట్ల 500,800,1000 కూడా దాటింది. కాని అంత మంది విద్యార్థులకు ఒక్కరే వ్యాయామ ఉపాధ్యాయుడు ఉన్నారు. కావున అలాంటి పాఠశాలలను గుర్తించి విద్యార్థుల సంఖ్య ఆధారంగా అదనంగా పీడీ ల నియామకం చేపట్టాలి..
4. జిల్లా,రాష్ట్ర , జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులందరికీ ఉచిత బస్సు సౌకర్యం, రైల్వే కన్సెషన్ ను పునరుద్ధరించాలి. క్రీడల లో పాల్గొనే ప్రతి బాలుడికి ఉచిత బాస్ సౌకర్యం కల్పించాలి.
5. పదవ తరగతి లోపు విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తే వారికి పదవ తరగతిలో ప్రత్యేక వెయిటేజీ ఇవ్వాలి.
6. అవసరమైన అన్ని పాఠశాలల్లో ఉపాధి హామీ నిధులతో క్రీడా మైదానాల చదునుకు చర్యలు తీసుకోవాలి.
7. జీవో నెంబర్ 10 రద్దుచేస్తూ జీవో నెంబర్ 79 పునరుద్దించాలి. ఎంపీఈడి అర్హత కలిగిన ఫిజికల్ డైరెక్టర్లకు వెంటనే జూనియర్ కళాశాలలో
ప్రమోషన్లు ఇవ్వాలి.
8. మోడల్ స్కూల్, ఆర్ ఎం ఎస్ ఏ
లో పనిచేస్తున్న ఫిజికల్ డైరెక్టర్లను రెగులర్ ప్రాతిపాదికన భర్తీ చేయాలి.వారికి గౌరవ ప్రథమైన వేతనం చెల్లించాలి..
9. కేజీబీవీ లలో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులను సి ఆర్ టి లను పీడీ లుగా అప్గ్రేడ్ చేసి, సమానమైన వేతనం చెల్లించాలి.
10. ఇన్ సర్వీస్ లో B.P.Ed, M.P. బిపి ఈడి, ఎంపీ ఈడి కోర్స్ చేయుటకు సమ్మర్ వెకేషన్లో కోర్సు పూర్తి చేసేలా గతంలో ఉన్న విధానాన్ని తీసుకురావాలి.
11. అన్ని ప్రైమరీ&UPS ప్రాథమిక ప్రాథమికోన్నత
పాఠశాలల్లో పి ఈ టి, ఉన్నత పాఠశాలలో SA ఎస్ ఏ
ఫిజికల్ ఎడ్యుకేషనల్ పీడీలను లను నియమించాలి.
12. వ్యాయామ విద్యను తప్పనిసరి నిర్బంధ విద్యగా మార్చాలి.
13. వ్యాయామ ఉపాధ్యాయులకు మీడియం తో సంబంధం లేకుండా బదిలీలు, పదోన్నతులు కల్పించాలి.
14. జీవో 317 ద్వారా నష్టపోయిన వ్యాయామ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి.
15. వ్యాయామ ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను నియోజకవర్గ లేదా రెవెన్యూ డివిజన్ ల వారిగా నిర్వహించాలి.
16. 201718 సంవత్సరం నుండి పెండింగ్ లో ఉన్న ఎస్ జి ఎఫ్ బకాయిలను వెంటనే చెల్లించడంతో పాటు 202627 లో నిర్వహించ బోయే ఎస్ జి ఎఫ్
క్రీడలకు ముందస్తుగా నిధులు విడుదల చేయాలి.
17. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛను ఓ పి ఎస్ ను పునరుద్ధరించాలి
18. రాబోయే డి ఎస్ సి పి టి ల పోస్ట్ లు పెంచాలి. ఆమోదం పొందిన 1800 పోస్టులు కాకుండా, పి ఈ టి
పోస్ట్ లు లేని హై స్కూల్ లు, యు పి ఎస్ ప్రైమరీ, అధిక విద్యార్థులు ఉన్న పాఠశాలలను పరిగణలోకి తీసుకొని ఇంకో 3000 పి ఈ టి పోస్టులు కలిపి నిరుద్యోగ వ్యాయామ విద్య ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలి.
19. ప్రైవేట్ పాఠశాలల్లో పని చేసే పీ ఈ టి లకు ప్రారంభ వేతనం 30,000 నుండి పొందేలా,ప్రతి సంవత్సరం ఇంక్రిమెంట్ ఇచ్చేలా ప్రైవేట్ స్కూల్ లకు ఆదేశాలు జారీ చేయాలి..
20. వేసవి శిక్షణ శిబిరాలను పకడ్బంది గా నిర్వహించి , పాల్గొనే పి ఈ టి లకు ఈ ఎల్ ఎస్ మంజూరు చేయాలి.
21. ప్రభుత్వ పాఠశాల ల్లో చదివే విద్యార్థులకు పాఠశాల ప్రారంభం లోనే స్కూల్ యూనిఫామ్ తో పాటుగా రెండు జతల స్పోర్ట్స్ డ్రెస్,బూట్లు ఇవ్వాలి.
22. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే అబ్బాయిలకు ప్రస్తుతం 12 సంవత్సరాలు (ఎనిమిదవ తరగతి వరకు ఫ్రీ రూట్ బస్ పాస్ ఇస్తున్నారు.. దానిని 15 సంవత్సరాలకు పెంచి ప్రభుత్వ బడుల్లో చదివే పేద పిల్లలకు ఆర్థిక భారం నుండి ఉపశమనం కల్పించగలరు.(అమ్మాయిలకు ప్రభుత్వం ఆధార కార్డు తో ఉచిత ప్రయాణం కల్పిస్తుంది.). పై విషయాలపై ఆలోచన జరిపి, రాష్ట్రం లో ప్రభుత్వ పాఠశాల ల, వ్యాయామ విద్య బలోపేతానికి కృషి చేయాలని పేట తెలంగాణ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బియ్యని కృష్ణయ్య డిమాండ్ చేస్తున్నారు.

బిజెపి ఆధ్వర్యంలో ఐకెపి పిఎసిఎస్ కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయలేదని ధర్నా

వలిగొండ నవంబర్ 13 (సమయం న్యూస్)



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ భారతీయ జనతా పార్టీ వలిగొండ మండల శాఖ అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ ఆధ్వర్యంలో రైతు ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి జిల్లా మాజీ అధ్యక్షుడు పాశం భాస్కర్ హాజరైనారు. వాడు మాట్లాడుతూ ఈ మండలానికి చెందిన ఎమ్మెల్యే గారి ఉండి కూడా ఇంతవరకు ఐకెపి, పిఎసిఎస్సి కేంద్రాలలో ధాన్యం కొనుగోలు ప్రారంభించలేదు. నామమాత్రం అన్ని కేంద్రాల్లో కొబ్బరికాయలు కొట్టి, రిబ్బన్లు కట్ చేయడం జరిగింది. కానీ ధాన్యం కొనుగోలు మాత్రం ఇంకా ప్రారంభం కాలేదు, అందువలన అందరూ రైతులు పండించిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు, మధ్య దళారులకు తక్కువ ధరలకు అమ్ముకోవడం జరుగుతుంది. కావున ఇప్పటికైనా వెంటనే అన్ని కేంద్రాలలో ధాన్యం కొనుగోలు ప్రారంభించాలని రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల జిల్లా వ్యాప్తంగా అందరి రైతులతో కలిసి ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్, జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలే చంద్రశేఖర్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల యాదిరెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు ఫకీర్ రాజేందర్ రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి కందుల తానీషా గౌడ్, జిల్లా నాయకులు బంధారపు లింగస్వామి, రాచకొండ కృష్ణ, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి మంద నరసింహ,జిల్లా కార్యవర్గ సభ్యులు మైసొల్ల రామనర్స్, కనతాల అశోక్ రెడ్డి, జిల్లా నాయకులు బంగారపు రాములు సీలోజు శ్రీరాములు, బచ్చు శ్రీనివాస్, మైసొల్ల మత్స్యగిరి ఎలిమినేటి వెంకటేష్, స్థానిక వార్డు నెంబర్ దంతూరి అరుణ్ గౌడ్, మండల ఉపాధ్యక్షులు అమరేందర్, నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శి లోడే లింగస్వామి గౌడ్, మండల కార్యదర్శులు శ్రీనివాస్,మహేష్ బిజెపి మండల నాయకులు జనార్దన్ రెడ్డి, పద్మ రెడ్డి, చిన్న మచ్చగిరి, రామచంద్రం, వెంకటేష్, లింగస్వామి, శ్రీధర్ , కృష్ణ, లక్ష్మయ్య , వెంకటేష్ మురళి వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, రైతులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్న మంగళారంలో విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

చేవెళ్ల, నవంబర్ 13: సమయం న్యూస్

మొయినాబాద్ మండలంలోని చిన్న మంగళారం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు.సామాజిక సేవకులు శ్రీ సర్వి ప్రీతం రెడ్డి తన స్వంత ఖర్చులతో సమకూర్చిన క్రీడా దుస్తులను చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. క్రీడలు శారీరక, మానసిక వికాసానికి ఎంతో దోహదపడతాయన్నారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. దాత సర్వి ప్రీతం రెడ్డి సేవలను ఎమ్మెల్యే అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్లలో ఆర్మీ వాహనం బోల్తా..

- **8 మంది జవాన్లకు గాయాలు, ఇద్దరి పరిస్థితి విషమం**

చేవెళ్ల, నవంబర్ 13: సమయం న్యూస్

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం అల్లవాడ గేట్ సమీపంలో శుక్రవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్మీ జవాన్లతో వెళ్తున్న వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. గోల్కొండ ఆర్మీ క్యాంపు నుంచి 14 మంది జవాన్లతో షాబాద్ వైపు ట్రైనింగ్ కోసం వెళ్తున్న వాహనం అల్లవాడ గేట్ వద్దకు రాగానే అదుపుతప్పి డివైడర్ ను ఢీకొట్టి పల్టీలు కొడుతూ రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో 8 మంది జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి, వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. వాహనాన్ని శిక్షణలో ఉన్న ట్రైనీ జవాను నడుపుతున్నట్లు చేవెళ్ల ఏసీపీ కిషన్ తెలిపారు. క్షతగాత్రులను వెంటనే గోల్కొండ ఆర్మీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చేవెళ్ల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్ ను క్లియర్ చేశారు. ప్రమాదంపై విచారణ జరుపుతున్నారు.



శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ రహదారి విస్తరణ బాధితులకు పరిహార చెక్కుల పంపిణీ

- **కొడంగల్ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ-**
- **బాధితులకు చెక్కులు అందించిన కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుముల తిరుపతిరెడ్డి**

కొడంగల్ మున్సిపల్, నవంబర్,13(సమయం న్యూస్)

కొడంగల్ పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి వెళ్లే రహదారి విస్తరణ పనుల్లో భాగంగా భూములు కోల్పోయిన బాధితులకు పరిహార చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా, రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన వారికి పరిహారం అందించే చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుముల తిరుపతిరెడ్డి పాల్గొని బాధితులకు పరిహార చెక్కులను అందజేశారు.శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి వచ్చే భక్తులకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడంతో పాటు, పట్టణంలో రాకపోకలు సులభతరం చేయడం ఈ విస్తరణ పనుల ప్రధాన ఉద్దేశం. అభివృద్ధి పనుల కోసం భూములు కోల్పోయిన బాధితులకు పరిహారం అందించడం ద్వారా వారి ప్రయోజనాలను కూడా పరిగణనలోకి తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి, కడా ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి,తాహేసిల్దార్ రాంబాబు, కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందరం ప్రశాంత్, కొడంగల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజీవరెడ్డి ,జిల్లా నాయకులు బాల్ రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్య గౌడ్, వైస్ మున్సిపల్ చైర్మన్ శంకర్ నాయక్, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు,కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, వివిధ గ్రామాల అధ్యక్షులు, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల రెన్యువల్‌పై హైకోర్టు కీలక ఆదేశాలు

హైదరాబాద్, నవంబర్ 13

జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల రెన్యువల్‌కు సంబంధించిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. గతంలో ఇచ్చిన న్యాయస్థానం ఆదేశాల అమలుపై పూర్తి వివరాలతో నవంబర్ 23, 2026లోగా నివేదిక సమర్పించాలని ఐ అండ్ పీఆర్ శాఖ అధికారులను ఆదేశించింది. తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీయూడబ్ల్యూజేఎఫ్) దాఖలు చేసిన పిటిషన్‌ను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పి. సామ్ కోశి, జస్టిస్ నర్సింగరావు నందికొండలతో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది.గత ఆదేశాలను అమలు చేశామని అధికారులు పేర్కొనగా, వాటికి సంబంధించిన ఆధారాలు, పత్రాలను సమర్పించాలని టీయూడబ్ల్యూజేఎఫ్ తరపు న్యాయవాది బర్కత్ అలీ ఖాన్ కోరారు. అక్రిడిటేషన్ కార్డుల రెన్యువల్ కోసం జర్నలిస్టుల జాబితాతో ఐ అండ్ పీఆర్ శాఖకు పంపిన లేఖలను కూడా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం అమలు స్థితిగతులపై పూర్తి నివేదికను నవంబర్ 23లోగా దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను అదే తేదీకి వాయిదా వేసింది. ప్రధాన రిట్ పిటిషన్ నవంబర్ 25న విచారణకు రానుంది.



శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే

- **కుంభం అనిల్ కుమార్ రెడ్డికి ఆహ్వానం.**

వలిగొండ నవంబర్ 13 (సమయం న్యూస్)

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వెంకటాపురం గ్రామంలోని శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో ఈ నెల 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న స్వామివారి బ్రహ్మోత్సవాలకు భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి దంపతులని ఆలయ చైర్మన్ తుమ్మల శ్రీనివాస్, ఈఓ వెంకటయ్య మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానించారు.ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే కి అందజేసి, ఉత్సవాలకు కుటుంబ సమేతంగా విచ్చేసి స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో అర్చకులు , ఆలయ పాలక మండలి సభ్యులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన ఎంపీడీవో

వలిగొండ నవంబర్ 13 (సమయం న్యూస్)

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి (ఎం.) తుర్కపల్లి, వెంకటాపురం, మొగిలిపాక, మరియు సర్వాపూర్, గ్రామ పంచాయతీలను సందర్శించి, ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి, ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించి, నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, అధికారుల సూచనలు పాటిస్తూ నాణ్యమైన ఇళ్లను నిర్మించుకోవాలని లబ్ధిదారులకు పిలుపునిచ్చారు.పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతంగా అమలయ్యేలా లబ్ధిదారులు సహకరించాలని ఎంపీడీఓ కోరారు.



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

వలిగొండ నవంబర్ 13 (సమయం న్యూస్)

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో వేముల కొండ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నూతనంగా ఇళ్లు నిర్మించుకోనున్న లబ్ధిదారుల ఇళ్లకు ముగ్గు పోసి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇండ్లు నిర్మించుకున్న కాడిగళ్ళ రేణుక శీను, మంద రవి మంగమ్మ, బోళ్ల వెంకటమ్మ నరసింహ,ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఏర్పుల వెంకటేశం, ఉప సర్పంచ్ అంబటి సాయికుమార్, కేశిరెడ్డి నీరజారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ బోడ బాలయ్య, వార్డు మెంబర్లు ఇంజమూరి శ్రీను, బత్తుల సువర్ణ, గ్రామ నాయకులు పులిపల్ముల రాములు, ఎస్కే రసూల్, కాడిగళ్ల రవి, కాడిగళ్ల లింగయ్య, కాడిగళ్ల రమేష్, ధర్మచారి, కడిగండ్ల పెద్ద లింగయ్య, కాడిగళ్ల రాజు తదితర గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.



మస్కట్‌లో మోసానికి గురై స్వదేశానికి

- **చేరుకున్న తుప్పడు లక్ష్మి**
- **కుటుంబానికి అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి**

దౌల్తాబాద్ మండలం, నవంబర్,13(సమయం న్యూస్)

ఉపాధి కోసం మస్కట్ వెళ్లి మోసానికి గురై అక్కడే చిక్కుకుపోయి అనేక ఇబ్బందులు ఎదుర్కొని స్వదేశానికి చేరుకున్న కొడంగల్ నియోజకవర్గానికి చెందిన తుప్పుడు లక్ష్మి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి.ఈ సందర్భంగా శుక్రవారం దౌల్తాబాద్ మండలం గోకపల్లాబాద్ గ్రామంలోని తుప్పుడు లక్ష్మి స్వగృహానికి స్వయంగా వెళ్లి వారి కుటుంబ సభ్యులను కలుసుకున్నారు. కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకుని, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దగ్గరుండి పరిశీలించారు.ఉపాధి కోసం విదేశాలకు వెళ్లి మోసానికి గురై ఇబ్బందులు పడుతున్న సమయంలో లక్ష్మి కుమారుడు రాజు తన తల్లి పరిస్థితిని నరేందర్ రెడ్డి దృష్టికి తీసుకురాగా, ఆయన ప్రత్యేక చొరవతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. కేటీఆర్ ఇచ్చిన మాట ప్రకారం ప్రత్యేక చర్యలు తీసుకుని లక్ష్మిని సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచిన బీఆర్ఎస్ పార్టీ నాయకత్వానికి, ముఖ్యంగా కేటీఆర్ గారికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



రబీ పంటల సాగు కార్యాచరణపై ప్రత్యేక దృష్టిపత్రికా ప్రకటన

- **రబీ పంటల సాగు కార్యాచరణపై ప్రత్యేక దృష్టి సారించాలి**
- **ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**

హైదరాబాద్, నవంబర్ 13



రబీ సీజన్‌కు సంబంధించి ప్రతి జిల్లాకు పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగును ప్రోత్సహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయం, ఉద్యానవనం, సూక్ష్మ సేద్యం, కూరగాయలు, పప్పుధాన్యాల సాగు, ధాన్యం కొనుగోళ్లు, భూసేకరణ, విద్యా కార్యక్రమాలపై సమీక్షించారు. ఎల్‌నినో ప్రభావం, వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక చేపట్టాలని, అవసరమైన విత్తనాలను ముందుగానే సిద్ధం చేసి రైతులకు సకాలంలో అందించాలని సూచించారు. కూరగాయలు, పప్పుధాన్యాల సాగుతో పాటు బిందు సేద్యాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలని తెలిపారు.ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా ముందస్తు ఏర్పాట్లు చేసి, రైతులకు ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. భూసేకరణ సమస్యలను గుర్తించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పాఠశాలలపై ప్రత్యేక పర్యవేక్షణకలెక్టర్లు తరచుగా ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యా కార్యక్రమాలు, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, బోధనా ప్రమాణాలను పరిశీలించాలని సంజయ్ జాజు సూచించారు. నిర్దిత గడువులో పూర్తి చేయాలని, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు.వీబీజీ రామ్ జీ (VBG RAM G) కార్యక్రమం విస్తరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నిర్దేశించిన ప్రభుత్వ ప్రాధాన్యతలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, జిల్లాల్లో కార్యక్రమాల పురోగతిని కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు.

రాష్ట్రపతి భవన్ కు విద్యార్థులకు ఆహ్వానం

- **బాలల దినోత్సవ వేడుకలకు బేగంపేట విద్యార్థులు**

రాయపోల్ : నవంబర్ 13..(సమయం న్యూస్)



మారుమూల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ జాతీయ స్థాయిలో సైన్స్ ప్రదర్శనల్లో ప్రతిభ చాటిన సిద్దిపేట జిల్లా రాయపోల్ బేగంపేట విద్యార్థులకు అరుదైన అవకాశం లభించింది. ఈ నెల 14న న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించే బాలల దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం బేగంపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఆహ్వానం అందింది. జాతీయ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్లు, విజ్ఞాన ప్రదర్శనల్లో విద్యార్థులు ప్రదర్శించిన సృజనాత్మకత, శాస్త్రీయ ఆలోచనలు, నూతన ఆవిష్కరణల ఫలితంగా ఈ అవకాశం దక్కిందని ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల తెలిపారు. రాష్ట్రపతిని కలుసుకుని రాష్ట్రపతి భవన్‌లో జరిగే వేడుకల్లో పాల్గొనడం జీవితంలో మరిచిపోలేని అనుభూతి అని పేర్కొన్నారు.ఎంతో ఆనందంగా, గర్వంగా ఉంది తొమ్మిదో తరగతి విద్యార్థిని దరిపల్లి పావని..రాష్ట్రపతి భవన్‌ను సందర్శించే అవకాశం రావడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉంది. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత పెరిగాయని, భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలు సాధించి దేశానికి మంచి పేరు తేవాలన్నదే నా లక్ష్యం.ఈ అవకాశం ఎంతో అదృష్టం పదో తరగతి విద్యార్థి మంద హర్షవర్ధన్ రాష్ట్రపతి భవన్‌ను సందర్శించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. పాఠశాలలో నిర్వహించే సైన్స్ ప్రయోగాలు, తి ప్రాజెక్టులు కొత్త విషయాలు తెలుసుకోవాలనే ఆసక్తిని పెంచాయి. భవిష్యత్తులో శాస్త్రవేత్తగా ఎదిగి దేశ అభివృద్ధికి కృషి చేయాలనేది తన కల.

మహిళా కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తా

- **నాలుగోసారి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షురాలిగా నీలం పద్మ నియామకం**
- **హైదరాబాద్‌లో నియామక పత్రం అందజేసిన మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కాలంబ**
- **క్షేత్రస్థాయి నుంచి మహిళా కాంగ్రెస్‌ను పటిష్టం చేయాలి: అల్కాలంబ**

ఆలేరు, నవంబరు 13ఆ(సమయం న్యూస్):



యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నీలం పద్మ నాలుగోసారి నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన స్టేట్ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కాలంబ నియామక పత్రాన్ని నీలం పద్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి కమలాక్షి రాజన్న, తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మయూరి సింగ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షురాలు అల్కాలంబ మాట్లాడుతూ మహిళా కాంగ్రెస్‌ను గ్రామ, మండల, డివిజన్ స్థాయిల నుంచి మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా కార్యకర్తలను ఏకతాటిపైకి తీసుకొచ్చి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. మహిళలను రాజకీయంగా చైతన్యవంతులను చేయడంతోపాటు పార్టీ కార్యక్రమాల్లో వారి భాగస్వామ్యాన్ని పెంచాలని పేర్కొన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని, వారి హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మహిళలకు వివరించడంతోపాటు వారి సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలో మహిళా కాంగ్రెస్‌ను మరింత క్రియాశీలకంగా తీర్చిదిద్దేందుకు నీలం పద్మ కృషి చేయాలని ఆకాంక్షించారు. మహిళా కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పార్టీ అప్పగించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. నాలుగోసారి జిల్లా అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన నీలం పద్మ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి మరోసారి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షురాలు అల్కాలంబకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణకు, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కు, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.గతంలో తాను జెడ్పీటీసీగా, శిశు సంక్షేమ శాఖ ఉమ్మడి నల్గొండ జిల్లా చైర్‌పర్సన్‌గా, ఉమ్మడి తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా, తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఇన్‌చార్జి కోఆర్డినేటర్‌గా వివిధ బాధ్యతలు నిర్వహించినట్లు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ జిల్లా వ్యాప్తంగా మహిళా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తానన్నారు. మహిళా కార్యకర్తలను సంఘటితం చేసి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేలా ప్రోత్సహిస్తానని తెలిపారు. మహిళల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారం, రాజకీయాల్లో మహిళలకు ప్రాతినిధ్యం పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తానని నీలం పద్మ స్పష్టం చేశారు.

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- **తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**

యాలాల మండలం, నవంబర్,13(సమయం న్యూస్)





ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని, దానిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. శుక్రవారం యాలాల మండలం జుంటుపల్లి గ్రామంలోని జెడ్పిహెచ్ఎస్ పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. విద్యార్థులను వారి సమస్యలు, పాఠశాలలో అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన సమతుల్య ఆహారం అందించడంతోపాటు, ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అల్పాహారం, మధ్యాహ్న భోజన కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందన్నారు. విద్యార్థుల కోసం ఎంత ఖర్చు చేసినా అది ఖర్చు కాదు..భావితరాల భవిష్యత్తు కోసం పెట్టే గొప్ప పెట్టుబడన్నారు. నేటి విద్యార్థులపై పెట్టే ప్రతి రూపాయి రేపటి సమాజ అభివృద్ధికి పునాది అవుతుందన్నారు. అనంతరం మండల పరిధిలోని జుంటుపల్లి గ్రామంలో రూ.50.95 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం 735 స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన లబ్ధిదారులకు వారి గ్రామాలకే వచ్చి స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తున్నామన్నారు. జుంటుపల్లి సీతారామచంద్ర స్వామి వారి ఆలయ అభివృద్ధికి రూ.20 కోట్ల నిధులతో ఆలయాన్ని అద్భుతంగా అభివృద్ధి చేయబోతున్నామన్నారు. జుంటుపల్లి ప్రాజెక్టు ద్వారా సుమారు 3,000 ఎకరాలకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవడంతో పాటు విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయనున్నామన్నారు.

బాలల హక్కులు, ఆరోగ్యం, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై సదస్సు

ఖమ్మం, నవంబర్ 13 : (సమయం న్యూస్)



బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఇందిరానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలల హక్కులు, బాలికల ఆరోగ్యం, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్ పి. దేవి మానస, బాలల హక్కులు, బాలల రక్షణ చట్టాలు, బాల్య వివాహాల నివారణ, విద్య ప్రాముఖ్యత గురించి వివరించారు. ముఖ్యంగా బాలికలకు రుతుక్రమ సమయంలో ఎదురయ్యే సమస్యలు, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. అలాగే నాల్సా పక్షోత్సవ అవగాహన ప్రచార కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్ప్రభావాలను వివరించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, చెడు అలవాట్లకు లోను కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా బాలల హక్కులు, బాలికల ఆరోగ్యంపై అవగాహన కల్పించే స్టిక్కర్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

కివీస్ చేతిలో టీమిండియా చిత్తు

- 244 పరుగుల తేడాతో ఘోర పరాజయం
- 89 పరుగులకే కుప్పకూలిన భారత బ్యాటింగ్ లైనప్
- నిప్పులు చెరిగిన మాట్ హెన్రీ.. 27 పరుగులిచ్చి 6 వికెట్లు
- తొలి ఓవర్‌లోనే రోహిత్, కోహ్లీ, అయ్యర్ పెవిలియన్‌కు



మౌంట్ మౌంగనుయ్ (న్యూజిలాండ్), నవంబర్ 13 (సమయం న్యూస్): న్యూజిలాండ్ పర్యటనలో టీమిండియాకు ఊహించని రీతిలో ఘోర పరాభవం ఎదురైంది. మౌంట్ మౌంగనుయ్ వేదికగా జరిగిన నాలుగో వన్డే మ్యాచ్‌లో ఆతిథ్య కివీస్ జట్టు 244 పరుగుల భారీ తేడాతో భారత్‌ను చిత్తుగా ఓడించింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పూర్తిగా తేలిపోయిన రోహిత్ సేన, వన్డే క్రికెట్ చరిత్రలోనే తమ అత్యంత చెత్త ప్రదర్శనల్లో ఒకదానిని నమోదు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 333 పరుగుల భారీ స్కోరు సాధించగా.. అనంతరం 334 పరుగుల లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన భారత్ కేవలం 89 పరుగులకే కుప్పకూలింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌కు ఓపెనర్ విల్ యంగ్ గట్టి పునాది వేశాడు. భారత బౌలర్లపై పూర్తి ఆధిపత్యం చెలాయిస్తూ 125 పరుగులతో అద్భుతమైన శతకం బాదాడు. అతని మెరుపు సెంచరీకి తోడు మిగతా బ్యాటర్లు కూడా రాణించడంతో కివీస్ జట్టు 333 పరుగుల భారీ స్కోరును బోర్డుపై ఉంచింది. మౌంట్ మౌంగనుయ్ పిచ్‌పై భారత్ ముందు 334 పరుగుల కష్టసాధ్యమైన లక్ష్యాన్ని నిర్దేశించింది. భారీ లక్ష్య ఛేదనలో భారత జట్టుకు ఆరంభంలోనే కోలుకోలేని దెబ్బ తగిలింది. న్యూజిలాండ్ స్టార్ పేసర్ మాట్ హెన్రీ నిప్పులు చెరిగే బంతులతో భారత టాపార్డర్‌ను కకావికలం చేశాడు. తన స్పెల్ తొలి ఓవర్‌లోనే కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, మిడిలార్డర్ కీలక ఆటగాడు శ్రేయస్ అయ్యర్‌లను పెవిలియన్‌కు పంపి టీమిండియా వెన్నువిరిచాడు. ఆ ఆరంభ షాక్ నుంచి భారత జట్టు ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. హెన్రీ ధాటికి భారత బ్యాటర్లు క్రీజులో నిలవలేక ఒకరి తర్వాత ఒకరు పెవిలియన్ బాట పట్టారు. అద్భుత బౌలింగ్‌తో భారత్ పతనాన్ని శాసించిన మాట్ హెన్రీ కేవలం 27 పరుగులు మాత్రమే ఇచ్చి 6 వికెట్లు పడగొట్టాడు. ఫలితంగా టీమిండియా కనీసం 100 పరుగుల మార్కును కూడా దాటలేక 89 పరుగులకే ఆలౌట్ అయి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ భారీ పరాజయంతో వన్డే క్రికెట్ చరిత్రలో పరుగుల పరంగా భారత్ ఎదుర్కొన్న అతిపెద్ద ఓటముల జాబితాలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. 2000 సంవత్సరంలో షార్జా వేదికగా శ్రీలంక చేతిలో 245 పరుగుల తేడాతో ఓడిపోవడం ఇప్పటికీ భారత్‌కు అత్యంత భారీ ఓటమిగా మొదటి స్థానంలో కొనసాగుతోంది. తాజాగా 2026లో న్యూజిలాండ్ చేతిలో ఎదురైన ఈ 244 పరుగుల పరాజయంతో టీమిండియా ఈ జాబితాలో రెండో స్థానానికి చేరుకుంది. కేవలం ఒక్క పరుగు తేడాతో తమ 26 ఏళ్ల నాటి అత్యంత చెత్త రికార్డును అధిగమించే ప్రమాదం నుంచి భారత్ తృటిలో తప్పించుకుంది.

ఖవాజాను బలిపశువును చేశారు


- కమిన్స్‌పై వార్నర్ సంచలన ఆరోపణలు!
- ఆస్ట్రేలియా క్రికెట్‌లో మళ్లీ బాల్ ట్యాంపరింగ్ వివాదం
- ఎనిమిదేళ్ల నాటి శాండ్‌పేపర్ ఉదంతంపై మాటల యుద్ధం



పెర్త్ (ఆస్ట్రేలియా), నవంబర్ 13 (సమయం న్యూస్): ఆస్ట్రేలియా క్రికెట్‌ను కుదిపేసిన ఎనిమిదేళ్ల నాటి బాల్ ట్యాంపరింగ్ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. 2018లో జరిగిన శాండ్‌పేపర్ ఉదంతంపై ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ చేసిన వ్యాఖ్యలను మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్ తీవ్రంగా తప్పుబట్టాడు. నిజాలు వెల్లడిస్తున్న ఉస్మాన్ ఖవాజాను కమిన్స్ బలిపశువును చేశాడంటూ సంచలన ఆరోపణలు చేశాడు. దీంతో ఆస్ట్రేలియా క్రికెట్‌లో పాత వివాదం కొత్త చర్చకు దారితీసింది. ఉస్మాన్ ఖవాజా రాసిన 'సబ్' ఆత్మకథ ఈ వివాదానికి కారణమైంది. 2018లో దక్షిణాఫ్రికాతో జరిగిన కేప్‌టౌన్ టెస్టులో బంతిని శాండ్‌పేపర్‌తో రుద్దే విషయం జట్టులోని అందరికీ తెలుసని ఖవాజా తన పుస్తకంలో పేర్కొన్నాడు. ఈ వ్యాఖ్యలను కమిన్స్ తీవ్రంగా ఖండించాడు. శాండ్‌పేపర్ వినియోగం గురించి తనకు ఎలాంటి సమాచారం లేదని, అందరికీ తెలుసనడం పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశాడు. ఈ నేపథ్యంలో పెర్త్‌లో ఓ క్రీడా ప్రసార సంస్థతో మాట్లాడిన వార్నర్ ఖవాజాకు అండగా నిలిచాడు. ఖవాజా తన పుస్తకంలో రాసిన విషయాలు నిజమేనని, అతడిని కమిన్స్ తప్పుబట్టడం బాధాకరమని పేర్కొన్నాడు. అప్పట్లో జరిగిన విచారణ కూడా లోపభూయిష్టంగా సాగిందని విమర్శించాడు. మరోవైపు సిడ్నీలో మీడియాతో మాట్లాడిన కమిన్స్ తనపై వచ్చిన ఆరోపణలను తోసిపుచ్చాడు. బాల్ ట్యాంపరింగ్ కుట్రలో తన ప్రమేయం లేదని, ఎనిమిదేళ్లుగా ఇదే విషయాన్ని చెబుతున్నానని స్పష్టం చేశాడు. 2018 మార్చిలో కేప్‌టౌన్ టెస్టు సందర్భంగా ఆస్ట్రేలియా ఆటగాడు కామెరూన్ బెన్‌క్రాఫ్ట్ శాండ్‌పేపర్‌తో బంతిని రుద్దుతూ కెమెరాలకు చిక్కాడు. ఈ ఘటనపై క్రికెట్ ఆస్ట్రేలియా విచారణ జరిపి అప్పటి కెప్టెన్ స్టీవ్ స్మిత్, వైస్ కెప్టెన్ డేవిడ్ వార్నర్‌లపై ఏడాది పాటు, బెన్‌క్రాఫ్ట్‌పై తొమ్మిది నెలల పాటు నిషేధం విధించింది. తాజాగా ఖవాజా ఆత్మకథతో ఆ వివాదం మళ్లీ రాజుకోవడంతో వార్నర్, కమిన్స్ మధ్య మాటల యుద్ధం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

రోహిత్, ఇషాన్ తప్పిదాలు

- ఐదు పరుగుల నుంచి 125 రన్స్‌కు విల్ యంగ్!
- ఆరంభంలోనే రెండు సులభమైన క్యాచ్‌లు వదిలేసిన భారత్



ఓవెల్, నవంబర్ 13 (సమయం న్యూస్): భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య ఓవెల్ వేదికగా జరుగుతున్న నాలుగో వన్డే మ్యాచ్‌లో కివీస్ బ్యాటర్ విల్ యంగ్ అద్భుత సెంచరీతో మెరిశాడు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌కు యంగ్ భారీ స్కోరు అందించాడు. 108 బంతుల్లో 14 ఫోర్లు, 4 సిక్సర్లతో మొత్తం 125 పరుగులు చేశాడు. అయితే అతడు సాధించిన ఈ సెంచరీ వెనుక టీమిండియా ఫీల్డర్ల తప్పిదాలు కీలకంగా నిలిచాయి. ముఖ్యంగా రోహిత్ శర్మ, ఇషాన్ కిషన్ ఇచ్చిన రెండు క్యాచ్ అవకాశాలను యంగ్ సద్వినియోగం చేసుకుని శతకం బాదాడు. ఇన్నింగ్స్ ఆరంభంలోనే విల్ యంగ్‌కు ఊహించని రీతిలో రెండు జీవనదానాలు లభించాయి. అతడు వ్యక్తిగత స్కోరు ఐదు పరుగుల వద్ద ఉన్నప్పుడు భారత బౌలర్ జెకిబ్ నబీ వేసిన రెండో ఓవర్ ఐదవ బంతికి తొలి లైఫ్ దక్కింది. స్లిప్‌లో ఫీల్డింగ్ చేస్తున్న రోహిత్ శర్మ సులభమైన క్యాచ్‌ను జారవిడిచాడు. ఆ తర్వాతి బంతికే మరోసారి యంగ్ ఔటయ్యే ప్రమాదం నుంచి బయటపడ్డాడు. యంగ్ బ్యాట్‌ను తాకిన బంతి వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ వైపు వెళ్లగా.. ఇషాన్ కూడా ఆ క్యాచ్‌ను అందుకోలేకపోయాడు.

భారత్‌ను దెబ్బతీసిన తప్పిదాలు

వరుస బంతుల్లో లభించిన ఈ రెండు అవకాశాలు న్యూజిలాండ్ బ్యాటర్‌కు పూర్తిగా కలిసొచ్చాయి. ఐదు పరుగుల వద్దే పెవిలియన్‌కు చేరాల్సిన విల్ యంగ్.. ఆ లైఫ్‌లను ఉపయోగించుకుని భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. క్రీజులో కుదురుకున్న తర్వాత బౌండరీలతో పరుగుల వేగాన్ని పెంచాడు. ఈ క్రమంలో 88 బంతుల్లోనే 11 ఫోర్లు, మూడు సిక్సర్ల సాయంతో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. భారత్‌పై అతడికిదే తొలి వన్డే సెంచరీ కాగా.. అంతర్జాతీయ వన్డే కెరీర్‌లో ఐదో శతకం కావడం విశేషం. సెంచరీ తర్వాత కూడా దూకుడు కొనసాగించిన యంగ్, చివరకు 37వ ఓవర్లో నమన్ ధీర్ బౌలింగ్‌లో సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్ కుమార్ కుశాగ్రకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఒకవేళ ఆరంభంలో రోహిత్ శర్మ, ఇషాన్ కిషన్‌లలో ఎవరో ఒకరు ఆ క్యాచ్ పట్టి ఉంటే విల్ యంగ్ ఇన్నింగ్స్ ఐదు పరుగులకే ముగిసేది. కానీ రెండు అవకాశాలు చేజారడంతో అతడు ఏకంగా 125 పరుగులు సాధించి మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. కీలక సమయంలో క్యాచ్‌లు వదిలేయడం టీమిండియాకు ఎంతటి నష్టాన్ని కలిగిస్తుందో ఈ ఇన్నింగ్స్ మరోసారి రుజువు చేసింది.



అంబేకర్, గుంజన్ స్వర్ణ చరిత్ర

యూత్ ఒలింపిక్స్ బాక్సింగ్ గోల్డెన్ పంచ్‌లు

డాకర్ (సెనెగల్), నవంబర్ 13 (సమయం న్యూస్): ప్రతిష్టాత్మక యూత్ ఒలింపిక్స్‌లో భారత యువ బాక్సర్లు అంబేకర్ మీతేయి, గుంజన్ సరికొత్త చరిత్ర సృష్టించారు. ఈ గేమ్స్ చరిత్రలో దేశానికి స్వర్ణ పతకాలు అందించిన బాక్సర్లుగా రికార్డుకెక్కారు. గురువారం జరిగిన ఫైనల్స్‌లో ఈ ఇద్దరూ గోల్డెన్ పంచ్‌లు విసిరారు. తొలుత పురుషుల 50 కేజీల తుదిపోరులోఅంబేకర్ 3-2తో ఐర్లాండ్ బాక్సర్ క్రిస్టియన్ జుబానిపై ఉత్కంఠ విజయం సాధించి యూత్ ఒలింపిక్ చాంపియన్ గా నిలిచాడు. హోరాహోరీగా సాగిన ఈ పోరులో జుబాని నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైనప్పటికీ ఒత్తిడికి తడబడకుండా పోరాడిన అంబేకర్ విజయం సొంతం చేసుకున్నాడు. యూత్ ఒలింపిక్స్ బాక్సింగ్‌లో శివ థాపా 2010 ఎడిషన్‌లో (60 కేజీల విభాగం) సాధించిన రజత పతకమే భారత్‌కు అత్యుత్తమ ప్రదర్శన కాగా.. ఇన్నేండ్లకు అంబేకర్ ఆ రికార్డులను బద్దలు కొట్టాడు. అనంతరం మహిళల 48 కేజీల విభాగంలో ఫైనల్లో అసాధారణ ప్రదర్శన చేసిన గుంజన్ 5-0తో బెన్సలా బుథియానా (అల్జీరియా)ను చిత్తు చేసింది. మూడు రౌండ్లలోనూ స్పష్టమైన పంచ్‌లతో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేసి పసిడి సొంతం చేసుకుంది.



తెలుగు బ్లాక్‌హాక్స్ విజయం

హైదరాబాద్, , నవంబర్ 13 (సమయం న్యూస్): ప్రైమ్ వాలీబాల్ లీగ్ తెలుగు బ్లాక్‌హాక్స్ జట్టు తెలుగు స్వాగ్ ట్రోఫీలో విజేతగా నిలిచింది. కంకణాల స్పోర్ట్స్ గ్రూప్ (కేఎస్ జీ)ఆధ్వర్యంలో విజయవాడలో గురువారం జరిగిన తుదిపోరులో ఆ జట్టు 5-0తేడాతో బ్లాక్‌హాక్స్ అకాడమీపై ఘనవిజయం సాధించింది. శాప్ వీసీ ఎండీ ఎస్. భరణితో కలిసి కేఎస్‌జీ చైర్మన్ కె. అభిషేక్‌రెడ్డి విజేతకు ట్రోఫీ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లోని వాలీబాల్ ప్రతిభను వెలికితీసి, యువ క్రీడాకారులకు ఉన్నత స్థాయి అవకాశాలు కల్పించడమే తమ తెలుగు బ్లాక్‌హాక్స్ ఫ్రాంచైజీ ప్రధాన లక్ష్యమని తెలిపాడు. ఆగస్టులో నిర్వహించిన ట్రయల్స్ ద్వారా సిరిల్ రెడ్డి (వరంగల్), విష్ణువర్ధన్ బాబు (యానం), నమిత్, మ-ునీష్ వెంకటేశన్, దీపక్ పీవీఎల్ ఐదో సీజన్ తెలుగు బ్లాక్‌హాక్స్ జట్టులో చోటు సంపాదించారని, మరో 12 మంది ప్రతిభావంతులను తమ అకాడమీ జట్టుకు ఎంపిక చేశామని తెలిపారు.



క్వార్టర్స్‌లో శ్రీకాంత్, లక్ష్య

కుమమోటో: జపాన్ మాస్టర్స్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లు కిదాంబి శ్రీకాంత్, లక్ష్యసేన్ క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరారు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్ లో మాజీ నంబర్ వన్ శ్రీకాంత్ 21-15, 11-21, 21-18తో ఐదో సీడ్, 8వ ర్యాంకర్ కొడాయ్ నరోకా (జపాన్)కు షాకిచ్చిచ్చాడు. మరో మ్యాచ్ లో ఎనిమిదో సీడ్ లక్ష్యసేన్ 21-8, 21-14తో డోంగ్ టియాన్ (చైనా)ను ఓడించి ముందంజ వేశాడు. కానీ మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి- ట్రీసా జాలీ 14-21, 14-21తో మూడో సీడ్ ఇవనగా-నకనిషి (జపాన్) చేతిలోఓడిపోయింది.



ప్రెగ్నెంట్ అయితేనేంటి?

సినిమాలకు గుడ్ బై చెప్పేది లేదు..

కియారా అద్వానీ సంచలన వ్యాఖ్యలు!

ముంబై, నవంబర్ 13 (సమయం న్యూస్): మాతృత్వం కారణంగా సినిమాలకు దూరమవుతానని భావించడం సరికాదని బాలీవుడ్ నటి కియారా అద్వానీ స్పష్టం చేశారు. కుటుంబ జీవితంలో స్థిరపడేందుకు నటనకు గుడ్‌బై చెప్పబోతున్నారంటూ వస్తున్న ఊహాగానాలను ఆమె తోసిపుచ్చారు. తనకు నచ్చిన సినిమాలు, పాత్రలను ఎంచుకునే స్వేచ్ఛ తనకుందని, వ్యక్తిగత జీవితంతోపాటు సినీ ప్రయాణాన్ని కూడా కొనసాగిస్తానని వెల్లడించారు. భర్త సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి కరణ్ జోహార్ నిర్వహించే 'కాఫీ విత్ కరణ్' తొమ్మిదో సీజన్‌లో పాల్గొన్న సందర్భంగా కియారా తన వ్యక్తిగత జీవితం, సినీ కెరీర్‌పై మాట్లాడినట్లు కథనాలు వెలువడ్డాయి. రెండోసారి గర్భవతి అంటూ జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో ఆమె వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తన కలలను సాకారం చేసుకునే విషయంలో వెనక్కి తగ్గబోనని, మాతృత్వం నటనా జీవితానికి అడ్డంకి కాదని ఆమె పేర్కొన్నట్లు సమాచారం. మరోవైపు 'టాక్సిక్' చిత్రం వైఫల్యం తనను తీవ్రంగా బాధించిందని కియారా చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా సినిమాలోని సన్నిహిత సన్నివేశాలపై సామాజిక మాధ్యమాల్లో వచ్చిన విమర్శలు తనను కుంగదీశాయని, ఆ కష్టకాలంలో సిద్ధార్థ్ మల్హోత్రా తనకు అండగా నిలిచారని వెల్లడించినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. 'లస్ట్ స్టోరీస్'లో తన నటనను చూసిన తర్వాత సిద్ధార్థ్ తనపై ఆసక్తి పెంచుకున్న విషయాన్ని కూడా ఆమె గుర్తుచేసుకున్నట్లు సమాచారం. వివాహం, మాతృత్వం కారణంగా నటీమణులు తమ వృత్తిని వదులుకోవాల్సిన అవసరం లేదనే అభిప్రాయాన్ని కియారా వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. తన భవిష్యత్తు నిర్ణయాలను తానే తీసుకుంటానని, సినిమాల్లో నటించడం కొనసాగిస్తానని స్పష్టం చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

దాదా ధమాకా.. దద్దరిల్లిపోతోంది ఇలాకా!

'స్టేట్ అంతా అదిరిపోద్ది.. నిదరంతా చెదిరిపోద్ది' అంటూ బాలయ్య మాస్ రచ్చ




హైదరాబాద్, నవంబర్ 13 (సమయం న్యూస్): నటసింహం నందమూరి బాలకృష్ణ మరోసారి తనదైన మాస్ మేనియాతో అభిమానులను ఉర్రూతలూగిస్తున్నారు. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ చిత్రం 'దాదా' నుంచి విడుదలైన తొలి గీతం 'దాదా ధమాకా' సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తోంది. 'స్టేట్ అంతా అదిరిపోద్ది.. నిదరంతా చెదిరిపోద్ది' అంటూ సాగే ఈ పాటకు సంగీత దర్శకుడు ఎస్.థమన్ అందించిన ఊరమాస్ బాణీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బాలయ్య ఎనర్జీ, మాస్ స్టెప్పులు అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వృద్ధి సినిమాస్ పతాకంపై భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో బాలకృష్ణ సరసన కాజల్ అగర్వాల్ నటిస్తుండగా, మంచు మనోజ్ ప్రతినాయకుడిగా కనిపించనున్నాడు. ప్రత్యేక గీతంలో బాలీవుడ్ నటి నర్గీస్ ఫక్రీ తన అందాలు, నృత్యాలతో ఆకట్టుకుంటోంది. రామజోగయ్యశాస్త్రి అందించిన సాహిత్యానికి థమన్ సంగీతం తోడవగా, బాలకృష్ణ స్వయంగా పాటకు గొంతు కలపడం మరో విశేషం. ఆయన గంభీరమైన గాత్రం పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. నృత్య దర్శకుడు శేఖర్ మాస్టర్ రూపొందించిన మాస్ స్టెప్పులతో బాలయ్య తనదైన శైలిలో అదరగొట్టారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, గ్లింప్స్ సినిమాపై అంచనాలు పెంచగా, తాజాగా వచ్చిన పాట మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముఖ్యంగా ఈ పాటతో అభిమానులు రూపొందిస్తున్న చిన్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తున్నాయి. మరోవైపు బాలకృష్ణకు ప్రమాదం జరగడంతో కొంతకాలం నిలిచిపోయిన చిత్రీకరణ ఇటీవల తిరిగి ప్రారంభమైంది. ప్రస్తుతం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. డిసెంబర్ 24న క్రిస్మస్ కానుకగా సినిమాను విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. 'వీరసింహారెడ్డి' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కలయికలో వస్తున్న 'దాదా' ప్రేక్షకులను ఎంతవరకు మెప్పిస్తుందో చూడాలి.

'పిచ్చి ప్రేమలో' ముంచేసిన నితిన్..
మనసు దోచే మెలోడీ!

'అలియాస్ రుక్మిణి' నుంచి రెండో గీతం విడుదల ■ డిసెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం

హైదరాబాద్, నవంబర్ 13 (సమయం న్యూస్): యువ కథానాయకుడు నితిన్ నటిస్తున్న తాజా చిత్రం 'అలియాస్ రుక్మిణి' నుంచి మరో మధురమైన ప్రేమగీతం ప్రేక్షకుల ముందుకొచ్చింది. నేచురల్ స్టార్ నాని సమర్పణలో యునానిమస్ ప్రొడక్షన్స్ పతాకంపై దీప్తి గంట నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రేమ, వినోదం కలగలిసిన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన 'రుక్మిణి' పాటకు మంచి స్పందన లభించగా, తాజాగా రెండో గీతం 'పిచ్చి ప్రేమలో'ను చిత్రబృందం విడుదల చేసింది. సంగీత దర్శకుడు విజయ్ బుల్గానిన్ స్వరపరిచిన ఈ పాట మధురమైన బాణీలతో ఆకట్టుకుంటోంది. గాయకుడు కార్తీక్ తన గాత్రంతో పాటకు ప్రాణం పోయగా, గీత రచయిత కృష్ణకాంత్ భార్యను భర్తకున్న ప్రేమను అందమైన పదాలతో ఆవిష్కరించారు. భార్య అల్లరి, అలకలు, చిన్నచిన్న సరదాలను ప్రేమగా ఆస్వాదించే భర్త మనోభావాలను ఈ గీతంలో చూపించారు. ఈశ్వర్ పెంటి రూపొందించిన నృత్యరీతులు పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చాయి. ముఖ్యంగా కొత్తగా పెళ్లయిన దంపతుల మధ్య ఉండే ప్రేమానురాగాలను సహజంగా చిత్రీకరించారు. భార్యాభర్తలు కలిసి బయటకు వెళ్లడం, భర్త తన భార్యను పాఠశాల వద్ద దింపడం వంటి సన్నివేశాలు మధ్యతరగతి కుటుంబ జీవితాన్ని ప్రతిబింబిస్తున్నాయి. సాధారణ మధ్యతరగతి భర్త పాత్రలో నితిన్ సహజంగా కనిపించగా, సంప్రదాయ దుస్తుల్లో ఆఫియా సయ్యద్ ఆకట్టుకున్నారు. వీరిద్దరి మధ్య ప్రేమ సన్నివేశాలు పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ చిత్రానికి జోమోన్ టి.జాన్ ఛాయాగ్రహణం, అవినాష్ కొల్లా నిర్మాణ రూపకల్పన, సృజన ఆదుసుమిల్లి కూర్పు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ప్రచార చిత్రాలు, పాటలతో ఆసక్తి రేకెత్తిస్తున్న 'అలియాస్ రుక్మిణి' డిసెంబర్ 4న థియేటర్లలో విడుదల కానుంది.



లాయర్‌గా కీర్తి సురేశ్!

ఆసక్తి రేపుతున్న 'సత్యవాన్ సావిత్రి' ట్రైలర్

వినోదం, కోర్టు డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం

హైదరాబాద్, నవంబర్ 13 (సమయం న్యూస్): జాతీయ ఉత్తమ నటి కీర్తి సురేశ్ మరో విభిన్న పాత్రతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'సత్యవాన్ సావిత్రి'. ప్రవీణ్ ఎస్. విజయ్ దర్శకత్వంలో వినోదం, కోర్టు డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఇందులో కీర్తి సురేశ్ న్యాయవాదిగా కనిపిస్తూ ఆసక్తి రేకెత్తిస్తున్నారు. బలవంతపు వివాహంతో ఒక్కటైన దంపతుల జీవితంలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకోవడం, భర్త హత్య కేసులో చిక్కుకోవడం కథలో కీలక మలుపులుగా కనిపిస్తున్నాయి. తనకు ఇష్టం లేకుండా పెళ్లి జరిగినప్పటికీ హత్య కేసులో చిక్కుకున్న భర్తను రక్షించేందుకు భార్య న్యాయవాదిగా ఎలాంటి పోరాటం చేసింది? అసలు ఆ హత్య వెనుక ఉన్న నిజాలేమిటి? అనే అంశాల చుట్టూ కథ సాగనుంది. వినోదంతోపాటు ఉత్కంఠభరితమైన న్యాయస్థాన సన్నివేశాలకు ప్రాధాన్యమిస్తూ ఈ చిత్రాన్ని రూపొందించారు. ఇప్పటివరకు విభిన్న పాత్రలతో మెప్పించిన కీర్తి సురేశ్ న్యాయవాదిగా ఎలాంటి నటన కనబరుస్తారనే ఆసక్తి నెలకొంది. నవంబర్ 20న 'సత్యవాన్ సావిత్రి' ప్రేక్షకుల ముందుకు రానుంది.



PRINTED AND PUBLIAHED BY **MOHAMMED MURTHUZA,** 1-2-524/3/B, ROOM NO. 110, 1ST FLOOR, SAGAR VIEW COMPLEX, DOMALGUDA, HYDERABAD, TELANGANA - 500080, ON BEHALF OF MOHAMMED MURTHUZA, EDITED BY MOHAMMED MURTHUZA, PRINTED BY JAKKULA NARENDER, AT VISION ANDHRA, 2-1-340/A/4, NEAR FEVER HOSPITAL, O.U.ROAD, NALLAKUNTA, HYDERABAD, TELANGANA - 500044. **PRGI NUMBER APTEL/2006/18267.** PHONE:**7036644111, 9490140565**

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

ఖమ్మం, నవంబర్ 13 : (సమయం)



మాదకద్రవ్యాల మహమ్మారిని రాష్ట్రం నుండి పూర్తిగా తరిమికొట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని, ఇందులో సమాజంలోని ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో నషా విముక్త్ భారత్ కింద పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన డ్రగ్స్ నిరోధ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన క్విజ్ పోటీలలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఐపీఎస్ అధికారుల పర్యవేక్షణలో సుమారు 600 మంది సభ్యులతో ఈగల్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు, ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8 వేల కేసులు నమోదు చేసి, 19 వేల మందికి పైగా నిందితులను అరెస్టు చేసి కఠిన శిక్షలు నమోదు చేశారన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు సంబంధించి ఎవరు ఫోన్లు చేసి సిఫార్సులు చేసినా ఉపేక్షించేది లేదని, తన సొంత మనుషులైనా సరే చట్టప్రకారం జైలుకు పంపాలని పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చానని మంత్రి తెలిపారు. కేవలం వినియోగదారులపైనే కాకుండా, డ్రగ్స్ సరఫరా మూలాలను గుర్తించి వాటిని పూర్తిగా నిర్మూలించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

గత పాలనలో డ్రగ్స్ నియంత్రణపై చిత్తశుద్ధి కొరవడిందని, మాజీ మంత్రుల ఫామ్‌హౌస్‌లలో సైతం డ్రగ్స్ పట్టుబడటం దురదృష్టకరమని అన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ ఉన్నాయన్న భయంతోనే నాటి మంత్రులు తమ పిల్లలను విదేశాల్లో చదివించుకున్నారని విమర్శించారు. కేవలం పోలీసు, ఎక్సైజ్ శాఖల వల్లే డ్రగ్స్ నియంత్రణ పూర్తిస్థాయిలో సాధ్యం కాదని, ఇందులో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. చిన్నతనంలోనే పిల్లల ప్రవర్తనను గమనించి, చెడు అలవాట్ల వైపు వెళ్లకుండా వారిని కట్టడి చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. అలాగే ఉపాధ్యాయులు పాఠాలతో పాటు విద్యార్థుల నడవడికపై కూడా కన్నేసి ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్ అదనపు కమిషనర్ కిషన్, డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, జిల్లా సూపరింటెండెంట్ డి. జానయ్య, ఏదులాపురం మున్సిపాలిటీ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలేరు రెవెన్యూ డివిజన్‌పై అధికారిక ప్రకటన విడుదల చేయించాలి

- **మహిళా అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బండ్రు శోభారాణికి అఖిలపక్ష కమిటీ వినతి**
- **మంత్రి పొంగులేటి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కమిటీ సభ్యులకు సమావేశం ఏర్పాటు చేస్తా: బండ్రు శోభారాణి హామీ**

ఆలేరు, నవంబర్ 13(సమయం న్యూస్)



ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం వెంటనే అధికారిక ప్రకటన విడుదల చేయాలని అఖిలపక్ష కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆలేరు పట్టణంలో మహిళా అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బండ్రు శోభారాణి నివాసం వద్ద ఆమెకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా అఖిలపక్ష కమిటీ నాయకులు మాట్లాడుతూ ఆలేరు ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ డిమాండ్ సాధన కోసం గత పదేళ్లుగా అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటు వల్ల ఆలేరు పరిసర ప్రాంతాల ప్రజలకు పరిపాలనాపరమైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని, ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన పనుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తగ్గుతాయని వివరించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన బీర్ల ఐలయ్య అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఎన్నికల ప్రచార సభల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సైతం ఈ అంశంపై ప్రకటనలు చేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తవుతున్నప్పటికీ ఇప్పటివరకు ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై అధికారిక ప్రకటన వెలువడకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇకనైనా కాలయాపన చేయకుండా ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు.ఆలేరు ప్రాంతానికి చెందిన బండ్రు శోభారాణి రాష్ట్రస్థాయిలో కీలక బాధ్యతల్లో ఉన్నందున ప్రత్యేక చొరవ తీసుకొని ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లాలని అఖిలపక్ష కమిటీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సంబంధించి తక్షణమే అధికారిక ప్రకటన వెలువడేలా కృషి చేయాలని కోరారు. వినతిపై స్పందించిన బండ్రు శోభారాణి త్వరలోనే అఖిలపక్ష కమిటీ సభ్యులను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లి ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అంశంపై చర్చిస్తానని హామీ ఇచ్చారు. అధికారిక ప్రకటన విడుదలయ్యేలా తనవంతు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కమిటీ కన్వీనర్ పసుపునూరి వీరేశం, కోకన్వీనర్ రాచకొండ జనార్దన్, చెక్క వెంకటేష్, మొరిగాడి శేఖర్, నంద గంగేష్, వడ్డె మాను కామెడీకారి అశోక్, దయ్యాల సంపత్, పేరపు రాములు, ప్రస్తుతం ఆంజనేయులు, బెజాడి అడవయ్య పాల్గొన్నారు.

మిత్రుడి మాతృమూర్తికి కన్నీటి నివాళి..

- **కుటుంబ సభ్యులను పరామర్శించి అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

కొండపర్తి, నవంబర్ 13 (సమయం న్యూస్)



ఐనవోలు మండలం కొండపర్తి గ్రామానికి చెందిన తన చిన్ననాటి మిత్రుడు కట్కూరి స్వామి మాతృమూర్తి కట్కూరి సాలమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు వారి కుటుంబాన్ని పరామర్శించారు. హన్మకొండ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్‌తో కలిసి సాలమ్మ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంతిమ యాత్రలో పాల్గొని తుది వీడ్కోలు పలికారు.చిన్ననాటి మిత్రుడి కుటుంబంలో చోటుచేసుకున్న విషాదం పట్ల నాగరాజు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మాతృమూర్తిని కోల్పోయిన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ కష్ట సమయంలో వారికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, వరంగల్ డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పోలేపల్లి శంకర్ రెడ్డి, మండల ముఖ్య నాయకులు, సర్పంచులు, డివిజన్, గ్రామశాఖ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, సొసైటీ డైరెక్టర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం ప్రజావాణి చొరవతో ఇద్దరు బాలికలకు న్యాయం

- **నల్ల మల్లారెడ్డి స్కూల్‌లో నిలిపివేసిన విద్యా సర్టిఫికెట్లు అందజేత**

హైదరాబాద్, నవంబర్ 13



ఫీజులు చెల్లించినప్పటికీ విద్యా ధ్రువపత్రాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురవుతున్న ఇద్దరు మైనర్ విద్యార్థినులకు సీఎం ప్రజావాణి చొరవతో న్యాయం జరిగింది.తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలి వైస్ చైర్‌పర్సన్, సీఎం ప్రజావాణి రాష్ట్ర స్థాయి ఇన్‌చార్జ్ గద్వాల విజయలక్ష్మి చొరవతో ఘట్కేసర్ మండలం నారపల్లిలోని నల్ల మల్లారెడ్డి ఫౌండేషన్ స్కూల్ నిలిపివేసిన విద్యా సర్టిఫికెట్లు శుక్రవారం సీఎం ప్రజావాణి కార్యక్రమంలో విద్యార్థినులకు అందజేశారు. గతంలో ప్రజావాణిని ఆశ్రయించిన ఉషాశ్రీ (10వ తరగతి), ఊర్వశి (7వ తరగతి) తమ అకడమిక్ సర్టిఫికెట్లు పాఠశాల యాజమాన్యం ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన విజయలక్ష్మి స్కూల్ ఎడ్యుకేషన్ ఆర్‌జేడీ సోమిరెడ్డితో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణాకు కూడా లేఖ రాశారు.దీంతో విద్యాశాఖ అధికారులు పాఠశాలకు వెళ్లి విద్యార్థినులకు సంబంధించిన ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (TC), బోనఫైడ్, కండక్ట్, మైగ్రేషన్ సర్టిఫికెట్లతో పాటు మార్కుల మెమోలు సేకరించి సీఎం ప్రజావాణికి అందజేశారు. అనంతరం విజయలక్ష్మి వాటిని విద్యార్థినులకు అందించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడూ, విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే హక్కు ఏ విద్యాసంస్థకూ లేదని స్పష్టం చేశారు. ఫీజులు లేదా ఇతర పరిపాలనా కారణాలతో విద్యార్థుల సర్టిఫికెట్లు నిలిపివేసి వారి చదువుకు ఆటంకం కలిగించడం సరికాదన్నారు. విద్యార్థుల హక్కులకు భంగం కలిగించే చర్యలను ప్రభుత్వం ఉపేక్షించదని హెచ్చరించారు.సర్టిఫికెట్లు అందడంతో తమ చదువు కొనసాగించేందుకు మార్గం సుగమం కావడంతో విద్యార్థినులు, వారి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. కావాలంటే దీనిని హిందీ డైలీ న్యూస్‌పేపర్ శైలిలో కూడా తయారు చేస్తాను.

ఏపీకే ఫైల్స్, తెలియని వెబ్సైట్లతో జాగ్రత్తగా ఉండాలి

- **అప్రమత్తతో సైబర్ నేరాల బారిన పడకుండా అడ్డుకోగలం.**
- **ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్, ఏపీకే ఫైల్స్, నకిలీ వెబ్సైట్స్, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ లాంటి నూతన పద్ధతులలో మోసం చేస్తున్న సైబర్ క్రైమ్ నేరగాళ్లు**
- **మోసపోయామని గ్రహించిన వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సంప్రదించాలి.**
- **జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS.**

నారాయణపేట,నవంబర్,13(సమయం న్యూస్)



ప్రస్తుత సమాజంలో సైబర్ నేరగాళ్లు నూతన పద్ధతులను ఉపయోగించి ప్రజలను మోసగిస్తున్న సందర్భంలో నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రజలందరికీ అవగాహన, అప్రమత్తతతోనే సైబర్ నేరాలను అడ్డుకోగలమని ఒక ప్రకటన తెలియజేశారు. ప్రస్తుతం సమాజంలో ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు, స్టాక్ మార్కెటింగ్ అంటూ లాభాలు చూపిస్తామంటూ ప్రైవేటు వ్యక్తులు చేస్తున్న మోసాలు సామాన్య ప్రజలకు తెలియాలని అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అదేవిధంగా వాట్సాప్ నందు టెలిగ్రామ్ నందు సోషల్ మీడియాలలో ఏపీకే ఫైల్స్ రావడం వాటి ద్వారా మొబైల్ కంట్రోల్ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లడం లాంటి సంభవిస్తుందని వాటిని అడ్డుకోవడానికి అప్రమత్తత ప్రధానాస్త్రంగా ఉంటుందని తెలిపారు. ఒకవేళ మోసగాళ్ల చేత మోసపోయినట్లయితే వెంటనే (గోల్డెన్ హవర్) లో జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి లేదా సైబర్ క్రైమ్ వెబ్సైట్ నందు ఫిర్యాదు చేయడం మొదటి కర్తవ్యం గా వ్యవహరిస్తుందని తెలిపారు. ముఖ్యంగా సైబర్ క్రైమ్ నేరస్తులు వినియోగిస్తున్న నూతన పద్ధతులు ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్, యూపీఐ ఫ్రాడ్, ఏపీకే ఫైల్స్, నకిలీ వెబ్సైట్లు, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ లాంటిది జరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ ముఖ్యంగా యువత మాయమాటలకు నమ్మి మోసపోకుండా ఉండాలని తెలిపారు. సైబర్ క్రైమ్ నేరగాళ్లు వినియోగిస్తున్న పద్ధతిని తెలియజేస్తూ ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు ముఖ్యంగా డబ్బులను వారి సొంత వెబ్సైట్ ల నందు ఇన్వెస్ట్మెంట్ చేసిన దానికన్నా ఎక్కువగా చూపిస్తారని ఒకవేళ డబ్బులను తీయాలి అనుకుంటే రాకుండా ఉంటాయని తెలియచేశారు.జిల్లా పరిధిలో ప్రజలకు సైబర్ నేరాల పైన విస్తృతంగా అవగాహన కార్యక్రమములు నిర్వహించాలని పోలీసు అధికారులకు ఎస్పీ గారు తెలిపారు.

జిల్లా పరిషత్ నూతన సమీకృత కార్యాలయాన్ని ప్రారంభించిన శాసనసభ స్పీకర్

- **శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్. పట్నం మహేందర్ రెడ్డి**

వికారాబాద్, నవంబర్,13(సమయం న్యూస్)



వికారాబాద్‌లో రూ.7 కోట్ల 90 లక్షల నిధులతో నిర్మించిన జిల్లా పరిషత్ నూతన సమీకృత కార్యాలయాన్ని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ స్నేహ మెహరా, ట్రైనీ కలెక్టర్ సచిన్ భరద్వాజ్, వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య, అధికారులు ,ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు ఇందిరమ్మ ఇళ్ల భరోసా

హైదరాబాద్, నవంబర్ 13

ఆటోరిక్షా కార్మికుల సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ పరిధిలో 'ఆటో నగర్ కాలనీ' ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మొదటి దశలో నాలుగు ప్రాంతాల్లో 2,000 ఫ్లాట్లు నిర్మించనున్నారు. బండ్లగూడ, గంధంగూడ, పేట్‌బషీరాబాద్, జల్‌పల్లి/లక్ష్మిగూడ ప్రాంతాల్లో ఒక్కో చోట 500 చొప్పున ఇళ్లు నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.220 కోట్ల అంచనా వ్యయం అవుతుందని మంత్రి వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్లు-టవర్స్ పథకం నిబంధనల ప్రకారం అర్హులైన ఆటో కార్మిక కుటుంబాలకు ఇళ్లను పారదర్శకంగా కేటాయించనున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో స్థలాల లభ్యత, సాంకేతిక, భౌగోళిక అంశాలను పరిశీలించి డీపీఆర్, ఆర్థిక ప్రతిపాదనలు సిద్ధం చేయాలని హౌసింగ్ బోర్డు అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు.అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో గుడిసెలు లేని, ప్రతి పేద వాడికి సొంతిల్లు ఉన్న తెలంగాణ నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ఏపీకి మరో తుఫాన్ ముప్పు

అమరావతి, నవంబర్ 13:

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడుతోంది. ఈ నెల 15 నాటికి వాయుగుండంగా, 16 నాటికి తుఫాన్‌గా మారే అవకాశం ఉందని వాతావరణ అంచనాలు చెబుతున్నాయి. తుఫాన్‌గా మారితే దీనికి *'అక్వాన్'*గా పేరు పెట్టే అవకాశం ఉంది.ఈ నెల 18, 19 తేదీల్లో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. గంటకు సుమారు 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని అంచనా. అయితే తుఫాన్ దిశ, తీవ్రత, తీరం దాటే ప్రాంతంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.తెలంగాణలో పొడి వాతావరణం తెలంగాణలో మరో మూడు రోజుల పాటు పొడి వాతావరణం కొనసాగనుంది. కొన్ని ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2-3 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.


రైళ్ల పునరుద్ధరణపై దక్షిణ మధ్య రైల్వే ప్రకటన

రద్దు చేసిన రైళ్లు పునరుద్ధరణ హైదరాబాద్: మెదక్-అకానపేట్ సెక్షన్‌లో డబ్లింగ్ పనుల్లో భాగంగా మనోహరాబాద్ యార్డులో అదనపు లైన్ ఏర్పాటు కోసం చేపట్టిన నాన్‌ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా గతంలో రద్దు/నియంత్రించిన కొన్ని రైళ్లను తిరిగి షెడ్యూల్ ప్రకారం నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది.కాచిగూడ-నిజామాబాద్, నిజామాబాద్-కాచిగూడ, సికింద్రాబాద్-సిద్దిపేట, సిద్దిపేట-సికింద్రాబాద్, కాచిగూడ-మెదక్, మెదక్-కాచిగూడ మధ్య నడిచే రైళ్లు పునరుద్ధరించబడ్డాయి. సంబంధిత తేదీల్లో ఈ రైళ్లు యథావిధిగా నడుస్తాయి.అదేవిధంగా CST ముంబై-లింగంపల్లి, భగత్ కీ కోఠి-కాచిగూడ, లింగంపల్లి-CST ముంబై, కాచిగూడ-పూర్ణా రైళ్లు కూడా నిర్ణీత తేదీల్లో షెడ్యూల్ ప్రకారం నడుస్తాయి. అయితే వీటిలో కొన్ని రైళ్లు 60 నుంచి 75 నిమిషాల వరకు నియంత్రించబడతాయి. దక్షిణ మధ్య రైల్వే

వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే

భూపాలపల్లి, నవంబర్ 13

భూపాలపల్లి నియోజకవర్గంలోని టేకుమట్ల, చిట్యాల మండలాల్లో జరిగిన వివాహ వేడుకలకు భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.టేకుమట్ల మండలం వెల్లంపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి రాధ-శ్రీనివాస్ దంపతుల కుమార్తె అలేఖ్య, రాకేష్ వివాహ వేడుకల్లో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. అలాగే ఎంపేడు గ్రామానికి చెందిన సట్ల కొమురయ్య-లత దంపతుల కుమారుడు రజనీకాంత్ గౌడ్, అఖిల వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. చిట్యాల మండలం నవాబ్‌పేట గ్రామానికి చెందిన సాద సాంబయ్య-విజయ దంపతుల కుమార్తె తులసి నూతన వస్త్ర, ఫల, పుష్పాలంకరణ కార్యక్రమంలో పాల్గొని ఆమెను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమాల్లో టేకుమట్ల, చిట్యాల మండలాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగే రైతు మహాసభకు భారీగా తరలిరావాలి

- **జిల్లా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య**

దుద్యాల మండలం, నవంబర్,13(సమయం న్యూస్)

నల్లగొండలో ఈనెల 15న జరిగే అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభల ప్రదర్శన, రైతు బహిరంగ సభకు రైతులు, కార్మికులు, కర్షకులు భారీగా తరలిరావాలని సీఐటీయూ వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం దుద్యాల మండల కేంద్రంలో మహా సభల పోస్టర్ ను ఆవిష్కరించారు. రైతులకు ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని, రైతు వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నర్సింలు పాల్గొన్నారు.

రిమ్స్‌కు అదనంగా 18 పీజీ వైద్య సీట్లు

- **కలెక్టర్ రాజర్షి షాను ఘనంగా సన్మానించిన రిమ్స్ వైద్య బృందం**

ఆదిలాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్)కు అదనంగా 18 పోస్టు గ్రాడ్యుయేట్ (పీజీ) వైద్య సీట్లు మంజూరయ్యాయి. జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రత్యేక చొరవ, కృషి ఫలితంగా ఈ సీట్లు మంజూరైనట్లు రిమ్స్ వైద్య బృందం తెలిపింది. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్‌తో పాటు వైద్యుల బృందం శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రాజర్షి షాను మర్యాదపూర్వకంగా కలిశారు. పీజీ సీట్ల మంజూరుకు కృషి చేసిన కలెక్టర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అదనపు పీజీ సీట్లతో రిమ్స్‌లో వైద్య విద్యావకాశాలు మరింత విస్తరించడంతో పాటు, నిపుణులైన వైద్యుల తయారీకి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు దోహదపడుతుందని వైద్య బృందం పేర్కొంది.



ఎన్ఆర్ఐ పూజారి మోసం కేసులో కీలక మలుపు

హైదరాబాద్, నవంబర్ 13

మోసం కేసులో పరారీలో ఉన్న ఎన్ఆర్ఐ పూజారి చామర్తి రామలచ్చారావు, ఆయన భార్య ప్రమీల బాచుపల్లి పోలీసుల ఎదుట హాజరయ్యారు. బాధితురాలి సంతకం ఫోర్జరీ చేసి, పత్రాలను అక్రమంగా వినియోగించి ఆమె పేరుతో శ్రీ గురుదత్త లక్ష్మీ నరసింహ గురువాంబిక శక్తి పీఠంను రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. పీఠం పేరుతో బ్యాంకు ఖాతా తెరిచి భారీగా అక్రమ లావాదేవీలు జరిపినట్లు ఫిర్యాదు నమోదైంది. హైకోర్టు ఆదేశాలతో నిందితులు పోలీసుల ఎదుట హాజరయ్యారు. పీఠం రిజిస్ట్రేషన్, బ్యాంకు లావాదేవీలు, బినామీ ఆస్తులపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మరికొందరు బాధితులు ఉన్నారా అనే కోణంలోనూ విచారణ కొనసాగుతోంది.

విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు

కుషాయిగూడ, సమయం

తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రధాన న్యాయమూర్తి శ్రీ వి. బాల భాస్కర్ రావు ఆదేశాల మేరకు, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.ఎస్.ఎల్. ప్రియాంక ఆధ్వర్యంలో శుక్రవారం కుషాయిగూడలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. నవంబర్ 14 బాలల దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సదస్సులో విద్యార్థులకు విద్యా హక్కు చట్టం, బాల్య వివాహ నిషేధ చట్టం, లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం (పోక్సో) 2012, బాలకార్మిక నిషేధ చట్టాల గురించి వివరించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బందితో పాటు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



భోలు ఏఐ సేవలు విస్తరణ

- **రైల్వే ప్రయాణికులకు మరింత సులభంగా 'భోలు ఏఐ'**

సికింద్రాబాద్ నవంబర్13(.)

దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికుల సమాచార సేవలను ఆధునీకరిస్తూ యాత్రి ఎల్ఎల్ఎం ఆధారిత భోలు ఏఐ సేవలను విస్తరించింది. కాచిగూడ, మల్కాజిగిరితో పాటు కర్నూలు సిటీ, గద్వాల్, మహబూబ్‌నగర్, కామారెడ్డి, నిజామాబాద్ స్టేషన్లలో భోలు ఏఐ సేవలు అందుబాటులోకి వచ్చాయి. రైళ్ల రాకపోకలు, బెర్తుల లభ్యత, కోచ్ స్థానాలు, స్టేషన్ మ్యాప్‌లు, ప్రయాణికుల సౌకర్యాల వివరాలను భోలు ద్వారా తెలుసుకోవచ్చు. రోజువారీ వినియోగం 200 మంది నుంచి 2,000 మందికి పైగా పెరిగిందని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. భోలు మినీ, భోలు మాక్స్ రూపాల్లో వాయిస్, టచ్‌స్క్రీన్ సేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రయాణికుల సేవలను మెరుగుపరిచిన హైదరాబాద్ డివిజన్ బృందాన్ని జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అభినందించారు.



కల్యాణ వేడుకల్లో కలిసిన ఆత్మీయత..

- **నూతన జంటలకు ఎమ్మెల్యే 'కేఆర్ నాగరాజు' శుభాకాంక్షలు**

ఐనవోలు, నవంబర్ 13 (సమయం న్యూస్)

వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు శుక్రవారం పలు ప్రాంతాల్లో జరిగిన వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో నిండాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఐనవోలు మండలం వనమాలకనపర్తి గ్రామానికి చెందిన ముత్తినేని రజిత రాజుల కుమార్తె ప్రేమలత, అఖిల్ పటేల్‌ల వివాహం మడికొండలోని శ్రీ రాజరాజేశ్వర గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది. అలాగే ఆకుతోట కన్వెన్షన్ హాల్‌లో బొల్లేన నీలమ్మ, బిక్షపతి దంపతుల కుమార్తె దివ్య వివాహ వేడుకకు హాజరయ్యారు. మామునూరు గ్రామానికి చెందిన అనుముల వనమాల మల్లారెడ్డి కుమారుడు శ్రీకాంత్ రెడ్డి, వెన్నెల రెడ్డిల వివాహం ఆదిత్య గార్డెన్స్‌లో నిర్వహించగా, ఈ వేడుకకు కూడా ఎమ్మెల్యే హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాల్లో మండల అధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, వరంగల్ డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ సిలువేరు శ్రీనివాస్, నియోజకవర్గ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆలేరు రెవెన్యూ డివిజన్‌పై అధికారిక ప్రకటన విడుదల చేయించాలి

- **మహిళా అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బండ్రు శోభారాణికి అఖిలపక్ష కమిటీ వినతి**
- **మంత్రి పొంగులేటి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కమిటీ సభ్యులకు సమావేశం ఏర్పాటు చేస్తా: బండ్రు శోభారాణి హామీ**

ఆలేరు, నవంబర్ 13(సమయం న్యూస్)



ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం వెంటనే అధికారిక ప్రకటన విడుదల చేయాలని అఖిలపక్ష కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆలేరు పట్టణంలో మహిళా అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బండ్రు శోభారాణి నివాసం వద్ద ఆమెకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిలపక్ష కమిటీ నాయకులు మాట్లాడుతూ ఆలేరు ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ డిమాండ్ సాధన కోసం గత పదేళ్లుగా అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటు వల్ల ఆలేరు పరిసర ప్రాంతాల ప్రజలకు పరిపాలనాపరమైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని, ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన పనుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తగ్గుతాయని వివరించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన బీర్ల ఐలయ్య అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఎన్నికల ప్రచార సభల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సైతం ఈ అంశంపై ప్రకటనలు చేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తవుతున్నప్పటికీ ఇప్పటివరకు ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై అధికారిక ప్రకటన వెలువడకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇకనైనా కాలయాపన చేయకుండా ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు.

ఆలేరు ప్రాంతానికి చెందిన బండ్రు శోభారాణి రాష్ట్రస్థాయిలో కీలక బాధ్యతల్లో ఉన్నందున ప్రత్యేక చొరవ తీసుకొని ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లాలని అఖిలపక్ష కమిటీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సంబంధించి తక్షణమే అధికారిక ప్రకటన వెలువడేలా కృషి చేయాలని కోరారు. వినతిపై స్పందించిన బండ్రు శోభారాణి త్వరలోనే అఖిలపక్ష కమిటీ సభ్యులను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లి ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అంశంపై చర్చిస్తానని హామీ ఇచ్చారు. అధికారిక ప్రకటన విడుదలయ్యేలా తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కమిటీ కన్వీనర్ పసుపునూరి వీరేశం, కోకన్వీనర్ రాచకొండ జనార్దన్, చెక్క వెంకటేష్, మొరిగాడి శేఖర్, నంద గంగేష్, వడ్డెమాను నరేందర్, తుంగ కుమార్, కామెడీకారి అశోక్, దయ్యాల సంపత్, పేరపు రాములు, ఎండీ సలీం, ప్రస్తుతం ఆంజనేయులు, బెజాడి కుమార్ అడవయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన జంటలకు 'ఇనగాల' ఆశీస్సులు

- **పెళ్లి పందిళ్లలో ఆత్మీయ అతిథిగా డిసిసి అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి**

హనుమకొండ, నవంబరు 13 (సమయం న్యూస్)



హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి శుక్రవారం పలు ప్రాంతాల్లో జరిగిన వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా మమేకమై శుభాకాంక్షలు తెలిపారు. పరంగల్ జిల్లా పరకాల నియోజకవర్గ పరిధిలోని 16వ డివిజన్ ధర్మారం గ్రామానికి చెందిన గోదాసి వీరేశం కుమార్తె వివాహ వేడుక కొనాయిమాకులలోని పీఎస్ఆర్ గార్డెన్స్‌లో జరగగా, హాజరై వధూవరులను ఆశీర్వదించారు. సంగెం మండలం కోట వెంకటాపూర్ గ్రామానికి చెందిన తాళ్లపెల్లి భాస్కర్ గౌడ్ కుమార్తె వివాహం నర్సంపేట నియోజకవర్గం గిర్నిబావిలోని వందన ఫంక్షన్ హాల్‌లో జరగగా, నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆత్మకూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు దుగ్యాల శ్రీను కుమార్తె సారె వేడుకకు ఆయన నివాసంలో హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. భూపాలపల్లి నియోజకవర్గం రేగొండ మండలం బాలయ్యపల్లి సర్పంచ్ తోట్ల రాజయ్య యాదవ్ కుమారుడి వివాహ వేడుక పరకాల పట్టణంలోని లలిత కన్వెన్షన్ హాల్‌లో వధూవరులను ఆశీర్వదించారు. అలాగే దుర్గంపేట గ్రామానికి చెందిన గడ్డం సదానందం కుమారుడి వివాహ వేడుక వరంగల్ కొత్తవాడలోని పద్మశాలి వెల్ఫేర్ ట్రస్ట్ హాల్‌లో హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

బీసీ ఉద్యమ పోరాట యోధుడికి జిల్లా బాధ్యతలు

- **బీసీ ఐక్య చైతన్య సమితి జిల్లా అధ్యక్షుడిగా 'కటకం విజయ్ కుమార్'**
- **నియామక ఉత్తర్వులు అందజేసిన రాష్ట్ర అధ్యక్షుడు ఆకారపు మోహన్**

వరంగల్/కొత్తవాడ, నవంబర్ 13 (సమయం న్యూస్)



బీసీల హక్కుల సాధన, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కల్పన కోసం నిరంతరం ఉద్యమిస్తున్న కటకం విజయ్ కుమార్‌కు బీసీ ఐక్య చైతన్య సమితి వరంగల్ జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన విజయ్ కుమార్‌ను జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆకారపు మోహన్ నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఆకారపు మోహన్ మాట్లాడుతూ బీసీల హక్కుల పరిరక్షణ, వారి అభ్యున్నతి కోసం సంఘటిత పోరాటాలు అవసరమని పేర్కొన్నారు. జిల్లాలో సమితిని మరింత బలోపేతం చేస్తూ బీసీ వర్గాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో నూతన అధ్యక్షుడు కీలకంగా వ్యవహరించాలని ఆకాంక్షించారు. జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కటకం విజయ్ కుమార్ బీసీ ఉద్యమాన్ని క్షేత్రస్థాయిలో విస్తరించడంతోపాటు, వివిధ బీసీ కుల సంఘాలను ఐక్య వేదికపైకి తీసుకురావడం, హక్కులు, సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలపై నిరంతరం కృషి చేయాల్సిన బాధ్యతను చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ నాయకుడు ఏపీ శ్రీను పాల్గొన్నారు. నియామకం పట్ల పలువురు బీసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

వారం రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

- **లేకుంటే ఆలేరు ఎమ్మెల్యేను నియోజకవర్గంలో తిరగనివ్వం**
- **బీజేపీ మండల, పట్టణ అధ్యక్షులు పూజారి కుమారస్వామి గౌడ్, నంద గంగేష్ హెచ్చరిక**

ఆలేరు, నవంబర్ 13(సమయం న్యూస్):



రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని బీజేపీ మండల, పట్టణ అధ్యక్షులు పూజారి కుమారస్వామి గౌడ్, నంద గంగేష్ లు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారం రోజుల్లోగా కొనుగోళ్లు ప్రారంభించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యేను ఆలేరు నియోజకవర్గంలో తిరగకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు ఆలేరు మార్కెట్ యార్డుతో పాటు షరాజీపేట గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. నాణ్యతలేని విద్యుత్ సరఫరా, కరెంటు కోతలు, కోతుల బెడద తదితర సమస్యలను ఎదుర్కొంటూ రైతులు ఎన్నో వ్యయప్రయాసల కోర్చి పంటలు సాగు చేశారని పేర్కొన్నారు. తీరా పంట చేతికొచ్చిన తర్వాత ధాన్యం విక్రయించుకునేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. కల్లాల్లో ధాన్యం రాశులు పేరుకుపోయి రోజుల తరబడి కొనుగోళ్ల కోసం రైతులు ఎదురుచూస్తున్నారని, అధికారులను ప్రాధేయపడుతూ తమ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కంటతడి పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులను అన్ని విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం వారిని నట్టేట ముంచే విధంగా వ్యవహరించడం తగదన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయడంతోపాటు ధాన్యం కాంటాలు ప్రారంభించి, రైతుల వద్ద ఉన్న పంటను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లోగా కొనుగోళ్లు ప్రారంభించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి స్థానిక ఎమ్మెల్యేను ఆలేరులో తిరగనివ్వకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కామిటికారి కృష్ణ, కౌన్సిలర్ వడ్డేమాన్ సరేందర్, జిల్లా కిసాన్ మోర్చా నాయకులు తునికి దశరథ, పూల హనుమంతు, కంతుల శంకర్, ప్రధాన కార్యదర్శులు ఏలగల వెంకటేష్, సుంకరి సృజన్, శేషత్వం అమరేందర్, మాజీ పట్టణ అధ్యక్షుడు బడుగు జాంగిర్, కార్యదర్శులు బైరి మహేందర్ గౌడ్, సీహెచ్ నాగరాజు, బీజేవైఎం మండల అధ్యక్షుడు మంత్రి సాయి ప్రసాద్, నాయకులు కళ్లెం యాదగిరి, బీజాని కొమరయ్య, సుక్కరాజు స్వామి, గాజుల సారయ్య, అంజయ్య, దూడల అఖిల్, పెండ్యాల దుర్గాప్రసాద్, రైతులు కుమ్మరి నరసింహులు, లక్ష్మి, సీస రేణుక, యాదగిరి, పాల్గొన్నారు.

రెండు వేల లోపు నిల్వ ఉన్న ఖాతాలకు స్టేట్‌మెంట్ అప్‌లోడ్ నుంచి మినహాయింపు

- **ఉప ఖజానా అధికారికి పీఆర్టీయూటీఎస్ ఆలేరు మండల శాఖ వినతి**

ఆలేరు, నవంబరు 13(సమయం న్యూస్):



ప్రతి నెల ఒకటో తేదీన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్ (డీడీఓ) ఖాతా వివరాల నివేదికను ఆర్థిక నిర్వహణ సమాచార వ్యవస్థ (ఐఎఫ్ఎంఐఎస్) పోర్టల్‌లో అప్‌లోడ్ చేసే విధానంలో రూ. రెండు వేల కంటే తక్కువ నిల్వ ఉన్న ఖాతాలకు మినహాయింపు కల్పించాలని పీఆర్టీయూటీఎస్ ఆలేరు మండల శాఖ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు భువనగిరి జిల్లా ఖజానా అధికారి మౌఖిక ఆదేశాల ప్రకారం ఆలేరు ఉప ఖజానా అధికారి శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రతి నెలా ఒకటో తేదీన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా డీడీఓ ఖాతా నిల్వల వివరాల నివేదికను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి వస్తోందని తెలిపారు. అయితే రూ. రెండు వేల కంటే తక్కువ నిల్వ ఉన్న ఖాతాలకు కూడా నివేదిక అప్‌లోడ్ చేయాల్సి రావడంతో ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని రూ. రెండు వేల కంటే తక్కువ నిల్వ ఉన్న ఖాతాలకు సంబంధించి నివేదిక అప్‌లోడ్ చేయకుండానే ఉప ఖజానా అధికారి ఆమోదం తెలిపేలా వెసులుబాటు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఉప ఖజానా అధికారి శ్రీనివాస్ సానుకూలంగా స్పందించినట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ ఆలేరు మండల అధ్యక్షుడు మూల తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చామల శ్రీధర్, జిల్లా అనుబంధ అధ్యక్షుడు రావుల సత్యనారాయణరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నారెడ్డి దశమంతరెడ్డి, జిల్లా కార్యదర్శి అల్లూరి సుదర్శన్, మండల కార్యదర్శి బందెల వినోద్‌కుమార్, సీనియర్ నాయకుడు కందుకూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.